
ఆంధ్రజ్యోతి

**** గరిష్ఠం 28.0 కనిష్ఠం 17.2

ANDHRAJYOTHY



నల్లగొండ

5 గురువారం 4 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	579.50 (281.5680)	15,445	15,445
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.76 (4.40)	727.42	171.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.3045)	640.62	702.43

చికెన్ ధరలు లైవ్: రూ.125 డ్రెస్: రూ.200 స్కిన్‌లెస్: రూ.230



తొలి విడతలో హోరాహోరీ

జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో హోరాహోరీ పోరుకు తెరలేచింది. పార్టీరహితంగా జరగాల్సిన ఎన్నికలైనా, రాజకీయపార్టీల మద్దతుతోనే అభ్యర్థులు బరిలో నిలుస్తుండడంతో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. తొలి విడత నల్లగొండ, చండూరు డివిజన్లలో మొత్తం 14 మండలాల్లోని 318 గ్రామపంచాయతీల్లో బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. మొత్తంగా 21 గ్రామ పంచాయతీల్లో ఒకటే నామినేషన్ చొప్పున రావడంతో ఆయా పంచాయతీల సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. వీటిల్లో 18 పంచాయతీలు కాంగ్రెస్ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఎన్నికవగా, రెండు పంచాయతీల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు, ఒక పంచాయతీలో సీపీఐ మద్దతుదారుడు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

- 318 పంచాయతీలకు 21 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం
- 297 పంచాయతీల్లో పోటాపోటీ
- ప్రచార రంగంలోకి అభ్యర్థులు
- రెండో విడత పంచాయతీల్లో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- మూడో విడత పంచాయతీల్లో నామినేషన్ల పర్వం ప్రారంభం
- 269 పంచాయతీలు, 2,206 వార్డులు

జిల్లాలోని నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 318 గ్రామపంచాయతీల్లో మొదటి దశలో ఎన్నికలు నిర్వహించనున్నారు. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ బుధవారం సాయంత్రంతో ముగిసింది. మొత్తంగా 21 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 297 పంచాయతీల్లో హోరాహోరీ పోరుకు తెరలేచింది. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల పరిధిలోని ఈ గ్రామాల్లో కాంగ్రెస్‌కు ధీటుగా బీఆర్ఎస్ నాయకులు పోటీచేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్‌తో సీపీఐ అవగాహనతో పోటీచేస్తుండగా, బీఆర్ఎస్ నాయకులు దాదాపు అన్నిచోట్లా ఒంటరిగా పోటీచేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రం బీజేపీతో అవగాహన కుదుర్చుకొని బరిలో నిలిచారు. అన్ని పంచాయతీల్లో బీఆర్ఎస్ తరఫున బలమైన నాయకులు బరిలో నిలవడంతో పోటీ తీవ్రంగా ఉండనుంది. దీంతో ప్రతి ఓటూ కీలకమేనని ఆయా పార్టీల నేతలు భావిస్తున్నారు. ఈ పంచాయతీల్లో ఈనెల 11న పోలింగ్ జరగనుండడంతో వారం రోజులు గ్రామాల్లో ప్రచార సందడి కొనసాగనుంది. గ్రామపంచాయతీల్లో బలపరిచిన, మద్దతిచ్చిన అభ్యర్థులనే గెలిపించుకునే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. వందశాతం పంచాయతీలను గెలిపించుకోవాలనే సంకల్పంతో కాంగ్రెస్ నేతలు ఉండగా, ప్రతీ పంచాయతీలో బలమైన పోటీ ఇవ్వడంతో పాటు, వీలైనన్ని గెలవాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నేతలు పావులు కదుపుతున్నారు.

మంత్రి నజరానా ప్రకటించినా..

నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేస్తే ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షలకు తోడు, తాను మరో రూ.20లక్షల నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించినా నియోజకవర్గంలో ఆశించిన రీతిలో పంచాయతీల ఏకగ్రీవం కాలేదు. నియోజకవర్గంలో 88 గ్రామపంచాయతీలు ఉండగా, ఏడు పంచాయతీల్లో మాత్రమే స ర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 81 పంచాయతీల్లో పోటీ

మొదటి విడతలో ఏకగ్రీవ పంచాయతీలు ఇలా..

నియోజకవర్గం	ఏకగ్రీవ పంచాయతీలు
నల్లగొండ	బచ్చన్నగూడెం, తేలకంటిగూడెం, కంకణాలపల్లి, మర్రిగూడెం, సోమోరిగూడెం, రసూల్‌పురం, ఖుదావానిపూర్
మునుగోడు	కొట్టాల, చొప్పరివారిగూడెం కమ్మగూడెం, బండతిమ్మాపురం, ఫకీర్‌పురం, నామ్యానాయక్‌తండా, నెమళ్లగూడెం
తుంగతుర్తి	శాలిగౌరారం
నకిరేకల్	దాసరిగూడెం, శేర్‌బావిగూడెం, మల్లాపురం, దుగినేల్లి, ఉప్పలపహాడ్, గొల్లగూడెం

సమన్వయంతో ముందుకు సాగాలి

సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



పార్టీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న జానారెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేలా చూడాలని, పార్టీలో ఎక్కువ మంది సర్పంచ్, వార్డులకు పోటీపడుతుంటే సామరస్యంగా కూర్చొని చర్చించుకోవాలని సూచించారు. ఆయన వెంట హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాగం మంగమ్మ, నాగెండ్ల కృష్ణారెడ్డి, శాగం అంజిరెడ్డి, నాగిరెడ్డి, లింగారెడ్డి, నల్లబోతు సైదులు, అనుముల అంజయ్య, అనుముల సాలయ్య, అనుముల శ్రీను, మద్దెల వెంకన్న, ఆర్.వెంకటేశ్వర్లు, ఉన్నారు.

● మంత్రి మనుమరాలికి సీఎం ఆశీస్సులు



హైదరాబాద్‌లో బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మనుమరాలి బాలసారాకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ఆశీస్సులు అందజేశారు.



ఎల్లారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని రాజకీయ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడే ఎంజీ యూనివర్సిటీ, పక్కనే పవిత్ర దేవస్థానం ఉన్న కారణంగా ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. అదే తనకు ఇచ్చే బహుమతిగా భావిస్తానన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్, స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎరువుల విక్రయాలు

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



జిల్లా కేంద్రంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీచేస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

నల్లగొండ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయాలను పటిష్టంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ-పాస్ యంత్రాల ద్వారా విక్రయాలను తప్పనిసరి చేసిందని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వానాకాలంలో రైతులకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గత అక్టోబరు నుంచి ఈ-పాస్ యంత్రాల ద్వారా విక్రయాలను మరింత పటిష్టం చేసిందన్నారు. ఈ యంత్రంలో ఆధార్ నెంబరు ఎంటర్ చేయగానే వివరాలు చూపుతుందన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో యాసంగిలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను జిల్లా ఎన్నికల అధికారులు బేఖాతర్ చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామానికి చెందిన చింతమల్ల కల్పన (అలియాస్ ధరావత్ కల్పన) నల్లగొండ శాసనసభ నియోజకవర్గంలోని 252 పోలింగ్‌స్టేషన్‌లో 951 సంఖ్యలో ఓటరుగా నమోదైందని అన్నారు. అయితే ఒత్తిడికి తలొగ్గి కలెక్టర్, అదనపు కలెక్టర్ ఓటర్ జాబితాలో చేర్చలేదన్నారు. సదరు ఓటరు హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు వాదనలు విన్న తరువాత ఓటును ఓటరు జాబితాలో చేర్చాలని కలెక్టర్‌ను సూచించిందన్నారు. సీపీఎం నాయకులు సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డితోపాటు ప్రతినిధి బృందం కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఈ విషయాన్ని విన్నవించగా ఓటరుగా నమోదుచేస్తామని చెప్పారన్నారు. అయినా అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి నామినేషన్ తిరస్కరిస్తున్నామని ప్రకటించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, హైకోర్టు ఆదేశాలను జిల్లా అధికారులు అపహాస్యం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే హైకోర్టు ఆదేశాల ప్రకారం కల్పన నామినేషన్‌ను ఆమోదించాలని, లేదంటే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌తోపాటు హైకోర్టుకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

లంచం అడగడం, తీసుకోవడం నేరం

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లంచం అడగడం తీసుకోవడం నేరమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఏసీబీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిపాలనలో పారదర్శకత అవసరమని, ఎవరైనా ప్రభుత్వాధికారి, ఉద్యోగి లంచం అడిగితే వెంటనే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చినవారి పేరును గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అవినీతిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, సోషల్ మీడియా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. వాట్సప్ నెంబర్‌కు 944044616 ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్, ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం ప్రత్యేక 'ప్రజావాణి'

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోటీల్లో దివ్యాంగులు క్రీడా స్ఫూర్తితో ఆడారన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక సామర్థ్యాలు పెంపొందించుకోవచ్చని అన్నారు. దివ్యాంగులకు సమాన హక్కులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, వారు బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.రమేష్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో పుట్ట శ్రీనివాస్, డీఈవో భిక్షపతి, జిల్లా క్రీడలు, యువజన సేవల అధికారి అక్బర్ అలీ, సీడీపీవో హరిత, తదితరులు పాల్గొన్నారు.



అవినీతి వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు, తిరుమలగిరి (సాగర్)): పంచాయతీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు దాఖలు చేసే నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని నిడమనూరు, ముకుందాపురం క్లస్టర్లలో, తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ల స్ర్కూట్నీని ఆమె తనిఖీచేశారు. మండలంలో ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులను ప్రశ్నించగా, సర్పంచ్ పదవులకు 237, వార్డు సభ్యులకు 600 నామినేషన్లు వచ్చాయని అధికారులు వివరించారు. నామినేషన్ పత్రాల పరిశీలనను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. నామినేషన్ పత్రాలతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్‌పుస్తకాలు, తదితర పత్రాలు జత చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అభ్యర్థులు సమర్పిస్తున్న పత్రాలు పూర్తి సమాచారంతో ఉండేలా చూడాలన్నారు. అభ్యర్థులకు తగిన సమాచారం అందించడంతో పాటు నామినేషన్లపై అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, తహసీల్దార్లు జంగాల కృష్ణయ్య, అనిల్, ఎంపీడీవోలు హిమబిందు, భిక్షంరాజు, తదితరులు ఉన్నారు.

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



సీఎం సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

దేవరకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో ఈనెల 6న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నందున ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం దేవరకొండ చర్పి రోడ్డులోని స్థలాన్ని హెలీప్యాడ్, సీఎం సభ కోసం డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం పర్యటన నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను అనుసరించి వ్యవహరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, సీఐ వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


నామినేషన్లను పరిశీలించాలి

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కేంద్రంలో అభ్యర్థితో పాటు ఒకరిద్దరికి మాత్రమే అనుమతించాలని, 100మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి రైతులు ఎక్కువగా ధాన్యం తీసుకొస్తున్నందున తేమ పరిశీలించి వేగంగా కాంటాలు వేసి ఎగుమతి చేయాలన్నారు. రవాణా సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో స్వర్ణలత, తహసీల్దార్ నరేందర్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, వాసికర్ల రమేష్, కోట్ల సతీష్, రాంరెడ్డి, సరస్వతి, పీఏసీఎస్ సీఈవో పల్లా తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతురత్న అవార్డు అందుకున్న అజయ్‌కుమార్‌రెడ్డి



అజయ్‌కుమార్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న మంత్రి తుమ్మల

చిట్యాలరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ వ్యవసాయంలో ఉత్తమ రైతుగా నిలిచిన మండల పరిధిలోని తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన రైతు పజ్జూరు అజయ్‌కుమార్‌రెడ్డి రైతురత్న అవార్డు అందుకున్నారు బుధవారం హైదరాబాద్‌లో పీజీపీఆర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు మేళాలో ఈ అవార్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు. సమీకృత వ్యవసాయ విధానాన్ని అవలంభిస్తున్న అభ్యుదయ రైతు అజయ్‌కుమార్‌రెడ్డి మంత్రి తుమ్మల ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఏళ్లుగా సమీకృత వ్యవసాయ విధానాన్ని అవలంభిస్తున్నట్టు తెలిపారు. రైతురత్న అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

దేవతలను అవమానిస్తే జాతిని కించపరిచనట్లే

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్

నల్లగొండ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవతలను అవమానపరిచేలా మాట్లాడడం హిందూజాతిని కించపరిచినట్లేనని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ ఇన్‌చార్జి వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని తగ్గించుకొని హిందూ దేవతలను ఉదాహరణగా పోల్చుతున్నారని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలను హిందూజాతి జీర్ణించుకోలేక పోతోందన్నారు. గతంలో కేసీఆర్ హిందువులు బంధువులు అని మాట్లాడితే కేసీఆర్ పాలనను ప్రజలు బొంద పెట్టారని, నేడు రేవంత్‌రెడ్డి కూడా అదే గతి పడుతుందన్నారు. హిందూ దేవతల గురించి మాట్లాడిన రేవంత్‌రెడ్డికి ఇతర మతస్థుల దేవతల గురించి మాట్లాడే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. హిందూ జాతిని అవమానపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ గడువు పెంచాలి

మహమ్మద్ షాహిద్ అహ్మద్

నల్లగొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ గడువును కేంద్ర ప్రభుత్వం పెంచాలని నల్లగొండ ఇఖామత్ బహదూర్ ఖాన్ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ షాహిద్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ షఫీ నవాజ్ ఖాన్‌లు కోరారు. బుధవారం ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయంలోని ఏవో మోతీలాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం వెబ్ పోర్టల్‌లో ఈ నెల 6వతేదీ వరకు గడువు విధించిందని, అయితే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదన్నారు. టెక్నికల్ ఎర్రర్ కారణంగా చాలా మసీదులు, ధార్మిక సంస్థలు, శ్మశాన వాటికలకు సంబంధించిన ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. 2026 జూన్ వరకు గడువు పెంచాలని కేంద్ర మైనార్టీశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి మహమ్మద్ ఖాజా ఫరీదుద్దీన్, తయ్యబ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ చరిత్రకు పునాది



శ్రీకాంతాచారి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ చరిత్రకు పునాది అని ఎంజీయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు వాడపల్లి నవీన్ అన్నారు. బుధవారం యూనివర్సిటీలో శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీకాంతాచారి త్యాగమే తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి మలుపుతిప్పిన ఘట్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు గాదె శివ, అక్షయ్, దినేష్, శ్రావణి, అలేఖ్య, పావని, తదితరులు పాల్గొన్నారు.

గడియారం సెంటర్‌లో..

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా గడియారం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటూరు వెంకటాచారి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, రమేష్, వెంకన్న, శంకరయ్య, దశరథ, తదితరులు పాల్గొన్నారు.



పల్లెపోరు..

సోషల్ మీడియా జోరు

● పంచాయతీ ఎన్నికలకు వేదికగా సామాజిక మాధ్యమాలు ● వాట్సప్ గ్రూపుల్లో అభ్యర్థుల ప్రచారం ● ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నాలు 6

భవితకు బాట

● ప్రత్యేక అవసరాల పిల్లలకు కొండంత అండ 7

స్వతంత్రంగా ఆలోచిస్తాం

తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువత

18 సంవత్సరాల వయసు దాటిన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు కావాలన్న కేంద్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వాల పిలుపు మేరకు ఈ పర్యాయం చాలా మంది యువ ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. పైగా గతంతో పోలిస్తే కేంద్ర ఎన్నికల సంఘం తెచ్చిన సంస్కరణలు, కొత్త సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుని ఓటరుగా నమోదయ్యే అవకాశం ఇవ్వడంతో కొత్త ఓటర్ల సంఖ్య పెరిగింది. ఓటు హక్కు పొందిన కొత్త ఓటర్లు రేపటి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తొలిసారిగా వినియోగించుకోబోతున్నారు. ఈ నేపథ్యంలో వారి అభిప్రాయాలు, అనుభూతిని వారి మాటల్లోనే...

● ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి

అభివృద్ధి చేసేవారికే ఓటు



నాకు కొత్తగా ఓటు హక్కు రావడం ఎంతో సంతోశంగా ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయిధమని పాఠ్యాంశాల ద్వారా తెలుసుకున్నాను. గ్రామాల సర్వతోముఖాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో విశిష్టమైనది. పోటీ చేస్తున్న నాయకుల్లో అభివృద్ధికి పాటుపడేవారిని గుర్తించి వారికి నా తొలి ఓటు వేస్తా. నేను స్వతంత్రంగానే ఆలోచించి నిర్ణయం తీసుకుంటా.

● పాల్వాయి సుదీక్ష, నార్కట్‌పల్లి,

ఓటు హక్కుతో ఓ గుర్తింపు



ఎన్నికల సమయంలో ఓటు వేయాలని రాజకీయ నాయకులు మా కుటుంబ సభ్యులను అభ్యర్థించే సమయంలో ఓటు హక్కు విలువ ఎంతో దగ్గరుండీ గ్రహించాను. ఈ పర్యాయం వచ్చిన ఓటు హక్కుతో నాకు కూడా ఓ ప్రత్యేక గుర్తింపు వచ్చిందని భావిస్తున్నా. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పినట్లు నా ప్రజలు సంతోషంగా, స్వేచ్ఛగా జీవించడానికి వారికి నేను డబ్బులు ఇవ్వలేదని ఓటు అనే ఆయుధాన్ని ఇచ్చాననే వ్యాఖ్యలు నాకు స్ఫూర్తినిచ్చాయి.

● కర్నాటి శ్రీహాసిని, నార్కట్‌పల్లి,

ఓటు వజ్రాయుధం



ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం అందించిన ఓ వజ్రాయుధం. అభివృద్ధి చేయడంతో పాటు ఎవరైతే యువతను ప్రోత్సాహిస్తారో వారికే నా తొలి ఓటు వేస్తా. ఎన్నో ఏళ్ల నుంచి నాకు ఓటు హక్కు ఎపుడు వస్తుందా అని ఎదురు చూశాను. నా పాలకుడిని నేనే ఎన్నుకునే హక్కు నాకు వచ్చిందనే ఓ గౌరవం ఎంతో తృప్తినిచ్చింది. ఓటు హక్కును దుర్వినియోగం చేయకుండా సరైన విధంగా వాడుకుంటా. యువత కూడా ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోకుండా మన ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే వాడిని ఎన్నుకోవాలి.

● కొమిరిశెట్టి ఉమేశ్, అమ్మనబోలు,

ఓటు హక్కు కోసం ఎదురుచూశా



నాకు కూడా ఓటు హక్కు ఎపుడు వస్తుందా అని ఎంతో ఎదురు చూసేవాడిని. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఉండే కోలాహలం, రాజకీయ నాయకులు ఓటర్లను పలకరించడం వంటివి చూసి నేను ఎపుడు ఓటరును అయ్యేదనిపించేది. ఓటు హక్కుకు అర్హత రాగానే దరఖాస్తు చేసుకున్నా. తొలిసారిగా గ్రామపంచాయతీ ఎన్నికలకే ఓటు హక్కు వినియోగించడం ఇంకా సంతోషంగా ఉంది.

● కట్టంగూర్ పవన్‌కుమార్, అమ్మనబోలు

పల్లెపోరు.. సోషల్ మీడియా జోరు

● పంచాయతీ ఎన్నికలకు వేదికగా సామాజిక మాధ్యమాలు ● వాట్సప్ గ్రూపుల్లో అభ్యర్థుల ప్రచారం ● ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నాలు

పంచాయతీ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగం ఎక్కువగా పెరగడంతో ఇది ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారింది. సామాజిక మాధ్యమాల వేదికగా 'పంచాయతీ' పోరు రవత్తరంగా మారింది. ఒకటి, రెండో విడతల నామినేషన్ల ప్రక్రియ ముగియడం, మూడో విడత నామినేషన్ల పర్వం మొదలు కావడంతో సోషల్ మీడియా వార్ ఊపందుకుంది.

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు



సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోస్టులే కనిపిస్తున్నాయి. ఆయా పార్టీల, అభ్యర్థులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు, కామెంట్లు ప్రత్యక్షమవుతున్నాయి. తనను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానంటూ అభ్యర్థులు రాసిచ్చిన బాండ్లు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతు న్నాయి. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా గ్రూపుల్లో పార్టీ శ్రేణులు, అభ్యర్థుల అనుచరులు యాక్టివ్ అయ్యారు. కార్యకర్తలు, అనుచరులు వివిధ రకాల పోస్టులతో మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

గ్రూపుల్లో రాజకీయ చర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపుల్లో రాజకీయ చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఆయా పార్టీలకు సంబంధించిన గ్రూపులతో పాటు గ్రామాలు, కుల, యువజన సంఘాలాంటి పలు గ్రూపుల్లో ఏ గ్రూపు చూసినా ఎన్నికలకు సంబంధించిన చర్చలు, పోస్టులే కన్పిస్తున్నాయి. నామినేషన్లు వేసిన, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఎవరికి వారు పోస్టులు పెడుతూ ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. పార్టీ టికెట్(మద్దతు) ఆశించి భంగపడిన వారు, వారి అనుచరులు పార్టీ నేతలను విమర్శిస్తూ పోస్టులు పెడు తున్నారు. కొన్నిచోట్ల ఒకే పార్టీకి చెందిన రెండు వర్గాలు బాహాబాహీ అన్నట్టుగా విమర్శలు గుప్పిస్తూ పోస్టులు పెడుతుండడంతో అది తమకు కలిసి వస్తుందని ప్రత్యర్థి అభ్యర్థులు సంతోషిస్తున్నారు.

ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా..

పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఖర్చు లేకుండా ఉపయోగపడే సోషల్ మీడియాను ఒక అస్త్రంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామాల్లో చిన్నా, పెద్ద అందరికీ మొబైల్ ఫోన్లు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ ఆగ్రామానికి చెందిన ఏదో ఓ గ్రూపులో ఉంటారు. సోషల్ మీడియాలో అను కూల పోస్టులు పెట్టడం ద్వారా ఓటర్లను కొంత మేర ప్రసన్నం చేసుకోవచ్చని భావిస్తున్నారు. అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లు, పాడించిన పాటలు సోషల్ మీడియా పోస్టు చేసి ఓటర్లకు చేరవేస్తున్నారు. ఒక్కో వాట్సాప్ గ్రూపులో వందల మంది ఉంటున్నందున అందులో సగం మంది చూసినా తమకు కొంతైనా ప్రయోజనమే కదా అంటున్నారు.

ఆలోచింపజేస్తున్న పోస్టులు

చలికాలంలో పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది. ఎన్నికలు మూడు విడతలుగా జరుగుతుండగా ఇప్పటికే సోషల్ మీడియా ప్రచారం జోరందుకుంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి గతాన్ని, గెలిపిస్తే భవిష్యత్‌లో ఆయన చేయబోయే పనులను చూసి ఓటేయాలంటూ చేసే సూచనలు ఆకట్టుకుంటున్నాయి. 'నీ చుట్టూ ఉన్న వాళ్లను నమ్మి పోటీ చేయకు, నమ్ముకున్న వాళ్లే నిన్ను నట్టేటముంచుతారు', 'ఇవి మంచి రోజులు కావు ముంచే రోజులు,' 'ధారళంగా డబ్బులు ఖర్చుచేసి అప్పుల పాలు కావద్దు' లాంటి హితబోధ చేసే పోస్టులు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. అభ్యర్థితో డబ్బులు ఖర్చు పెట్టించి, తాగి, తింటూ ఎంజా య్ చేసే వర్గం గ్రామాల్లో అక్కడక్కడ కన్పిస్తోంది. గెలుస్తావంటూ ఊదరగొట్టి, తీరా ఓడిపోయాక ముఖం చాటేసే వారూ ఉంటారు. ఆ తరహా వారిని ఉద్దేశించి గ్రూపుల్లో పెడుతున్న పోస్టులు, రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనుల గురించి, అందులోని లోపాలు ఎత్తిచూపుతూ ఒకరినొకరు విమర్శించుకుంటూ పెడుతున్న పోస్టులు జనాలను ఆలోచింపజేస్తున్నాయి.

గ్రామపాలనలో తమదైన ముద్ర

● 30 సంవత్సరాలుగా సేవలందించిన చంద్రమౌళి కుటుంబం



మచ్చ చంద్రమౌళి, కళావతి, వసంత, శ్రీనివాస్‌గౌడ్

బొమ్మలరామారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలంలోని చీకటిమామిడి గ్రామానికి మచ్చ చంద్రమౌళి కుటుంబం సర్పంచ్‌గా 30 సంవత్సరాలుగా సేవలందించింది. గ్రామానికి చెందిన మచ్చ చంద్రమౌళిగౌడ్ తొలిసారిగా 1995, 2001 సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2007లో ఆయన తల్లి మచ్చ కళావతి సర్పంచ్‌గా పనిచేయగా, 2019లో ఆయన సోదరుడు శ్రీనివాస్‌గౌడ్ భార్య వసంతను సర్పంచ్‌గా సేవలందించారు. సోదరుడి బాటలోనే నడవాలనే ఉద్దేశంతో అతని సోదరుడు మచ్చ శ్రీనివాస్‌గౌడ్ ఎంపీటీసీగా 2013లో గెలిచి సేవలందించారు. మచ్చ శ్రీనివాస్‌గౌడ్ ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేస్తూ ఆలేరు నియోజకవర్గ ప్రజలతో మమేకమయ్యారు. చంద్రమౌళిగౌడ్, సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచే గ్రామాన్ని అన్ని విధాలు అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో గ్రామ పంచాయతీ నిధులే కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు ఏర్పాటుకు స్థలం, గదుల నిర్మాణానికి సొంతంగా లక్షల రూపాయలు కేటాయించారు. తిరుమలనాథ స్వామి ఆలయం పునర్నిర్మాణం కోసం కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి మచ్చ కుటుంబం ఇప్పటికీ ముందుంటుంది. ఆ గ్రామంలో నేటికీ 30 ఏళ్ల పైగా ప్రజలకు సేవలు అందించి ప్రస్తుత సర్పంచ్ ఎన్నికల్లో అవకాశమున్నా మరొకరికి అవకాం కల్పించారు. మచ్చ కుటుంబంలో రాజకీయంగా గెలుపు అవకాశాలున్నా నేటి ఎన్నికల్లో ఇతరులకు అవకాశం కల్పించామని తెలిపారు.

నర్సింగ్ కుటుంబానిదే హవా

● సర్పంచులుగా తండ్రి, తల్లి, కుమారుడు గ్రామానికి సేవ



నర్సింగు కృష్ణయ్య, సత్తెమ్మ, విజయ్‌కుమార్

నిడమనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరుసగా నాలుగు పర్యాయాలు గెలుస్తూ తండ్రి, తల్లి, కొడుకు ఇలా ముగ్గురు ఆ గ్రామానికి సర్పంచులుగా ఎన్నికయ్యారు. గతంలో గ్రామ సర్పంచుగా భర్త పని చేయగా, అనంతరం భార్య గెలవగా, తర్వాత వారి కుమారుడు కూడా సర్పంచుగా ఎన్నికయ్యారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఊటుకూరు సింగిల్‌విండోకు 1998లో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా గ్రామానికి చెందిన నర్సింగు కృష్ణయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల్లో గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ మేరెడ్డి వెంకటనర్సింహారెడ్డిని ఓడించి ఔరా అనిపించారు. పదేళ్ల చైర్మన్‌గా ఉంటూ రైతుల సంక్షేమం కోసం పనిచేశారు. 2008లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. 2013లో గ్రామ సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వు కావడంతో గ్రామస్థులు ఆయన భార్య సత్తెమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె హయాంలో సైతం గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారు. 2019 ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ పదవి జనరల్‌కు కేటాయించగా వారి కుమారుడు విజయ్‌కుమార్ పోటీ చేసి విజయం సాధించారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన ప్రజాసేవ చేయాలనే తపనతో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేశారు. వరుసగా ఒకే కుటుంబానికి చెందినవారు మూడు సార్లు గ్రామానికి సర్పంచులుగా ఎన్నికయ్యారు. తల్లిదండ్రుల స్ఫూర్తితో కొడుకు కూడా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఊట్కూరు పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది.

జాతీయ అవార్డు వచ్చేలా

● నిర్మల్ పురస్కార్ బి.వెల్లెంల ప్రత్యేకత

● అభివృద్ధిపై మాజీ సర్పంచ్ ధనలక్ష్మి ముద్ర



ధనలక్ష్మి

నార్కట్‌పల్లి, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామం 2007లో కేంద్ర ప్రభు త్వం ఇచ్చే నిర్మల్ పురస్కార్ అవార్డు అందుకొని ప్రత్యేకత చాటుకుంది. 2006 నుంచి 2012 వరకు విద్యాధికురాలైన సోమనబోయిన ధనలక్ష్మి(కాంగ్రెస్ మద్దతుతో) సర్పంచ్‌గా ఎన్నికై పనిచేశారు. సుమారు రూ.10లక్షల అంచనా వ్యయంతో గ్రామంలో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇచ్చి సీసీరోడ్లు, మురుగు కాల్వలు, మరుగు దొడ్ల నిర్మించారు. దీంతో బీ.వెల్లెంల గ్రామం నిర్మల్ పురస్కార్‌కు ఎంపిక కాగా 2007 డిసెంబరు 6వ తేదీన మహారాష్ట్రలోని పుణేలో జరిగిన కార్యక్రమంలో అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ నుంచి సర్పంచ్ ధనలక్ష్మి అవార్డు అందుకున్నారు. అనంతరం కర్ణాటక, ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం అప్పట్లో బీ.వెల్లెం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులు పరిశీలించారు. కాగా నిర్మల్ పురస్కార్‌కు ఎంపికయ్యేలా పనిచేసి బీ.వెల్లెంలకు కేంద్ర స్థాయిలో గుర్తింపు తెచ్చేలా పాలన నిర్వహించిన అప్పటి సర్పంచ్ సోమనబోయిన ధనలక్ష్మి ప్రస్తుతం నకిరేకల్ మండలం చందుపట్ల గురుకుల జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకు రాలిగా పని చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా ధనలక్ష్మిని పలకరించగా పారిశుధ్య నిర్వహణపై నిర్మల్ పురస్కారం రావడంలో పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ, గ్రామస్థులందరి సహకారం ఉందని చెప్పారు.

మా ఓటు అమ్మకానికి లేదు

● ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన మాజీ వార్డుమెంబర్

నార్కట్‌పల్లి, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): 'మా ఓట్లు అమ్మకానికి కావు.. సేవలకులకే మా ఓట్లు..' అని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు దేవరశెట్టి రుక్మిణీ తన నివాసం ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల ఉపసంహరణ ఘట్టం పూర్తై బరిలో ఉండే అభ్యర్థులు ఎవరో తేలిపోవడంతో ప్రచారం ప్రారంభించడమే మిగిలింది. ఓట్ల కోసం వచ్చే నాయకులకు సూచనగా' మా ఓట్లు అమ్మకానికి కావు.. సేవకులకే మా ఓట్లు..' అనే నినాదంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి గ్రామస్థులను ఆలోచించేలా చేస్తున్నారు.



మాజీ వార్డుసభ్యురాలు రుక్మిణీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బంక్‌లో కల్తీ పెట్రోల్



బాటిల్‌లో నీళ్లపైకి తేలిన పెట్రోల్

బొమ్మలరామారం, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలోని హిందుస్థాన్ పెట్రోల్ బంక్‌లో పోయించుకున్న పెట్రోల్ కల్తీగా ఉందని గ్రామానికి చెందిన బాంద్ర ఐలేష్ ఆరోపించాడు. గ్రామంలోని అశోక్ ఫిలింగ్ స్టేషన్ పేరుతో ఉన్న హిందుస్థాన్ పెట్రోల్ బంక్‌లో ఐలేష్ బుధవారం ఒక బాటిల్‌లో లీటర్ పెట్రోల్ పోయించుకున్నాడు. రెండు, మూడు నిమిషాల తర్వాత చూస్తే బాటిల్ పోయించిన పెట్రోల్‌కు బదులుగా కింద భాగంలో నీళ్ల ఉండడంతో ఇదేమిటని నిర్వాహకులను అడిగాడు. తాము కల్తీ చేయలేదని పై నుంచి అలాగే వచ్చిందని సమాధానం చెప్పారు. నిర్వాహకులతో వాగ్వాదానికి దిగినా ఫలితం లేకుండా పోయింది. అక్కడడికి వచ్చిన వాహనదారులు ఆరోపించారు. కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నా క్వాలిటీ కంట్రోల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపించారు. కల్తీ పెట్రోల్ చూసి మరికొంత మంది చేసేదేమీలేక వెనుదిరిగారు. కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్న ఫిల్లింగ్ స్టేషన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

గుండంలో మునిగి బాలుడి మృతి



సంతోష్ మృతదేహం

యాదగిరిగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో కొండ కింద లక్ష్మీపుష్కరిణి(గుండం) నీటిలో మునిగి బాలుడు మృతిచెందాడు. పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన టీకోలు బుజ్జమ్మ తన కుమారుడు సంతోష్(10)తో కలిసి మంగళవారం రాత్రి యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చారు. కల్యాణకట్ట వద్ద రాత్రి బస చేయగా బాలుడు బుధవారం ఉదయం 9 గంటలకు ఆడుకునేందుకు వెళ్లి గుండంలో కాలుజారి పడిపోయాడు. ఊపిరాడక ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలుడి తల్లి బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మహారాష్ట్ర నుంచి వచ్చి ఆళ్లగడప వద్ద పట్టుబడి

● టోల్‌గేట్ వద్ద ఆరు ధాన్యం లారీలు పట్టుకున్న పోలీసులు

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వస్తున్న ధాన్యం లారీలను పోలీసులు పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని అలగడప సమీపంలోని టోల్‌గేట్ వద్ద పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టి ధాన్యం లారీలను ఆపి సంబంధిత పత్రాలు పరిశీలించారు. మహారాష్ట్ర, ఖమ్మం, ఇతర ప్రాంతాల నుంచి మిర్యాలగూడ మిల్లులకు వస్తున్న ధాన్యం లారీలను నిలిపివేశారు. సంబంధిత పత్రాలను పరిశీలించి మహారాష్ట్రకు చెందిన ఆరు లారీలను స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. మిర్యాలగూడ ప్రాంతానికి బయటి ప్రాంతాల నుంచి వస్తున్న ధాన్యం లారీలను అడ్డుకునే క్రమంలో రాజకీయ, వ్యాపార వర్గాల నుంచి సంబంధిత అధికారులకు ఫోన్‌కాల్స్ ద్వారా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. అనుమతులు లేకుండా అక్రమంగా వస్తున్న బయటి ధాన్యాన్ని అడ్డుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



టోల్‌గేట్ వద్ద పోలీసులు పట్టుకున్న ధాన్యం లోడు లారీలు

దొండపాడు వద్ద ఏడు లారీలు

చింతలపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుండడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు లారీల్లో ధాన్యాన్ని తెలంగాణకు పంపిస్తున్నారు. ఆంధ్రా ప్రాంతం నుంచి తెలంగాణకు తరలిస్తున్న ఏడు ధాన్యం లోడు లారీలను సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని దొండపాడు వద్ద బుధవారం పోలీసులు పట్టుకున్నారు. గత సంవత్సరం కూడా ఇదే రోజుల్లో వందలాది లారీలను పట్టుకున్న స్థానిక రైతులు తిప్పి పంపారు. చెక్‌పోస్టు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తాజాగా సూర్యాపేట జిల్లాలో ఆంధ్రా ధాన్యం లారీలను పోలీసులు పోలీసులు పట్టుకున్నారు. ఆర్టీప చెక్‌పోస్టులు ఎత్తివేశారు. ఏఎంసీ చెక్‌పోస్టుల వద్ద కూడా సిబ్బంది లేకపోవడంతో ఆంధ్రా పర్మిట్ లారీలు రాష్ట్రంలోకి వస్తున్నా అడ్డుకునే వారు లేరు. ఏడు లారీలను పట్టుకున్న పోలీసులు సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆంధ్రా నుంచి లారీలు తెచ్చిన డ్రైవర్లను పోలీసులు ప్రశ్నిస్తే సమాధానం కూడా చెప్పకుండా లారీలను అక్కడే వదిలి వెళ్లిపోయారని ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ మృతి

అర్వపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొని సబ్‌స్టేషన్ ఆపరేటర్ మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గద్దగూటి మల్లయ్య(46) జాతీయ రహదారిపై సూర్యాపేట వైపు బైక్‌పై వెళ్తుండగా సూర్యాపేట వైపు అతి వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. దీంతో కాళ్లు, తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇసుక లోడు ట్రాక్టర్ డ్రైవర్ ఢీకొట్టి పరారయ్యాడు. మల్లయ్య నాగారం మండలం ఫణిగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మల్లయ్యకు భార్య, కుమార్తెలు ఉన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాగారం సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్ఐలు సైదులు, చిరంజీవి అర్వపల్లిలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. బుధవారం అర్వపల్లిలో మల్లయ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఇంటి పెద్ద కోల్పోవడంతో భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు.



మల్లయ్య(ఫైల్)

వృద్ధురాలిపై రోకలిబండతో మహిళ దాడి

● నల్లగొండ జిల్లా దేవరకొండలో ఘటన

దేవరకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని గాంధీనగర్‌లో భాగ్యమ్మ అనే వృద్ధురాలిపై బుధవారం గుర్తుతెలియని మహిళ రోకలి బండతో దాడి చేసింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, వృద్ధురాలి కుమారుడు శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలో గాంధీనగర్‌లో శ్రీనివాసాచారితో పాటు భార్య లక్ష్మి తల్లి భాగ్యమ్మను నివాసం ఉంటున్నారు. శ్రీనివాసాచారి ఆయన భార్య బుధవారం విధుల్లోకి వెళ్లారు. ఇంట్లో తల్లి భాగ్యమ్మ ఒక్కతే ఉంది. బుర్కా వేసుకొని వచ్చిన గుర్తుతెలియని మహిళ ప్రవేశించి నీ కోడలు ఇంట్లో ఉందా అని అడిగి పలికరించింది. అనంతరం రోకలిబండతో మహిళ భాగ్యమ్మ తలపై దాడి చేసింది. దీంతో వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టు పక్కల ఉన్నవారు ఇంట్లోకి చేరుకొని లోపే గుర్తుతెలియని మహిళ పరారైంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి తీవ్ర గాయాలైన భాగ్యమ్మను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుమారుడు శ్రీనివాసాచారి బుధవారం రాత్రి దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భాగ్యమ్మ పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. డబ్బుతో పాటు నగల కోసమే మహిళ దాడి చేసిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. వృ ద్ధురాలు కుమారుడు శ్రీనివాసాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.



గాయపడిన వృద్ధురాలు భాగ్యమ్మ

కిడ్నాప్ కేసులో కొనసాగుతున్న విచారణ

● కేసు నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ

తిప్పర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్ వ్యవహారంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. నవంబరు 29వ తేదీన సర్పంచ్ నామినేషన్ వేసేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ మద్దతుదారు అభ్యర్థి నాగలక్ష్మి భర్త యాదగిరిని అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు కిడ్నాప్ చేశారని నల్లగొండ జిల్లా ఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన తర్వాత కిడ్నాప్ జరిగిన ప్రదేశం నకిరేకల్ పోలీసుస్టేషన్ పరిధిలోకి రావటంతో కేసును ఆ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశామని ఎస్ఐ శంకర్ తెలిపారు. విచారణలో కిడ్నాప్ ఉదంతంపై నిజానిజాలు, బాధితుడు చెప్పిన విషయాలు, కిడ్నాప్ జరిగిన విషయంలో వాస్తవాలను పోలీసులు విచారిస్తున్నారు.

దామరచర్లలో 38 లీటర్ల మద్యం పట్టివేత



దామరచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో బుధవారం పట్టుకున్నారు. వాడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్‌పాడు గ్రామానికి చెందిన అజ్మీరా వినోద్‌కుమార్, గంధం మహేష్, మెగావత్ నాగా కలిసి మద్యం బాటిళ్లతో గ్రామానికి చెందిన వెళ్లడానికి దామరచర్ల సెంటర్‌లో వేచి ఉన్నారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకొని పరిశీలించగా, రూ.35వేల విలువగల 38.1లీటర్ల మ ద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తుంగతుర్తి, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో 19 కేసులు నమోదు చేసినట్లు సీఐ రజిత బుధవారం ప్రకటనలో తెలిపారు. 17 లీటర్ల సారా, 27 లీటర్ల మద్యం, 24 లీటర్ల బీర్లు, ఒక ద్విచక్ర వాహనం, 1800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.78వేల వరకు ఉంటుందని తెలిపారు. స్థానిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా సారా విక్రయించినా, తయారు చేసినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భవితకు బాట

● ప్రత్యేక అవసరాల పిల్లలకు కొండంత అండ ● భవిత కేంద్రం ఏర్పాటులో జిల్లా ముందంజ



భవిత కేంద్రంలో చిన్నారిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఆనందాన్ని పంచుకోవాలన్నా.. బాధన చెప్పుకోవాలన్నా... వారిలోని ఆలోచనలు వ్యక్తం చేయాలన్నా వారికి ప్రత్యేకమైన విద్యా విధానం అవసరం. సమాజంలో వేసే ప్రతీ అడుగుకు అంగవైకల్యం అడ్డుకాకూడదనే ఆలోచనతో వారిని మనోస్థైర్యంతో ముందుక వెళ్లేలా ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్)

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు నేడు కొండంత అండగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 592 భవిత కేంద్రాలు ఉండగా, నల్లగొండ జిల్లాలో 31 భవిత కేంద్రాలున్నాయి. వాటిలో కొన్ని ప్రభుత్వ పాఠశాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న సందర్భంలో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ప్రత్యేక భవనాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా నూతన భవనాలు నిర్మించారు. జిల్లాలో 30 పాఠశాల భవనాలు అందుబాటులోకి రాగా మాడ్గులపల్లి భవనం మాత్రమే నిర్మాణ దశలో ఉంది. 31 పాఠశాలలకు గాను 519 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయడంతో నేడు ప్రత్యేక విద్యకు ప్రాధాన్యం దక్కింది. విద్యార్థులకు వారంలో రెండు రోజులు ప్రత్యేకమైన వైద్య సిబ్బందితో స్పీచ్, ఫిజియో థెరపి చేస్తుండడంతో విద్యార్థుల్లో శారీరక ఇబ్బందులు కొంతమేరా తగ్గే అవకాశం ఉంటుంది. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆర్గనైజేషన్ ఎలింకో సంస్థనుంచి ప్రతి ఏడాది వైద్య శిబిరం ఏర్పాటుచేసి సహాయ ఉపకరణాలు అందజేస్తుంటారు. భవిత కేంద్రాల్లో అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడిలోపం తదితర 21లోపాలతో బాధపడుతున్న చిన్నారులకు విద్యను అందించడంతోపాటు తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తుంది. దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు నిలుస్తున్నాయి. అలాంటి భవిత కేంద్రాల ఏర్పాటులో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక చొరవ తీసుకొని ఒక టీంను ఏర్పాటుచేసి నేడు రాష్ట్రంలోనే భవిత కేంద్రాల ఏర్పాటులో ముందంజలో ఉండేలా విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరుల సమన్వయంతో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.



ఫిజియో థెరపీ నిర్వహిస్తూ..

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు..

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రత్యేకంగా విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో 2006లో మండల రిసోర్స్ టీచర్లను ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. సాధారణ పాఠశాలల్లో ఉండే ప్రత్యేక విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు ఎంఆర్‌టీలు కృషి చేస్తూనే పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ అందించేవారు. ఎంఆర్‌టీలు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి థెరపి కార్యక్రమాలు చేపడుతూ వారిని ప్రోత్సహించేవారు. 2012లో ప్రత్యేకంగా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సర్వశిక్షా అభియాన్, రాజీవ్ విద్యామిషన్ ద్వారా భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సమగ్ర శిక్షపేరుతో సొంత భవనాలు లేని మండలాల్లో భవిత కేంద్రాల భవన నిర్మాణాలను చేపట్టి పాత భవనాలను ఆధునికీకరించి నూతన హంగులతో విద్యార్థులను ఆకర్షించేలా, అన్ని వసతులు, సౌకర్యాలు అందించేలా ప్రభుత్వం కృషి చేసింది.

ప్రధాన ఉద్దేశ్యం

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు శారీరక ఎదుగుదల, మానసిక ఎదుగుదల కోసం థెరపిలు చేసి విద్యాబోధన సాగిస్తుంటారు. చిన్నారులను సాధారణ పాఠశాలల్లోని విద్యార్థులకు సమ్మిళితమయ్యేలా వారిలో ప్రతిభను పెంచేలా చేయడం భవిత కేంద్రాల ప్రధాన ఉద్దేశ్యం. భవిత కేంద్రాల్లో చిన్నారులను చేర్పించే సమయంలో వారిలోని లోపాలను గుర్తించి వారికి అందించాల్సిన థెరపిల కోసం హెల్త్‌చెకప్‌చేసి సర్టిఫికెట్ ఆధారంగా అవసరమైన చికిత్సలు, ఉపకరణాలు అందిస్తుంటారు. పాఠశాలల్లో అన్నిరకాల ఆట వస్తువులు, ఉపకరణాలు అందుబాటులో ఉంటాయి. ప్రథమ స్థాయి నుంచి పదో తరగతి వరకు, 18 ఏళ్ల వయస్సు వరకు విద్యాబోధన అందిస్తుంటారు. వీరికి అవసరమైన ప్రత్యేక విద్య, అభ్యసన పుస్తకాలు అందుబాటులో ఉంచుతారు. ఐఈఆర్‌పీ (ఇన్‌క్లూజీవ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్)లు విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి సహకరిస్తుంటారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు భవిత కేంద్రాలు నిర్వహిస్తారు. దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు భవిత భరోసా కల్పిస్తుందని చెప్పకోవచ్చు.

'భవిత' ఏర్పాటులో జిల్లా ముందంజ

రాష్ట్రంలో ఉన్న 592 భవిత కేంద్రాలను విద్యార్థులకు అనుగుణంగా అధునాతన పద్ధతులతో ప్రత్యేక వసతులను ఏర్పాటు చేసి కళాత్మకమైన హంగులతో భవనాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి భవిత కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి, తమదైన శైలిలో త్వరగా భవిత కేంద్రాల రూపకల్పనకు కృషిచేసి నల్లగొండ జిల్లాను ముందంజలో నిలిపారు. పక్క జిల్లాల అధికారులు సైతం జిల్లాలోని కేంద్రాలను పరిశీలించేందుకు వస్తుండడం అధికారుల సమన్వయానికి గుర్తింపుగా పేర్కొనవచ్చు.

సామాజిక బాధ్యతను కలిగి ఉందాం



సమాజంలో ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గౌరవించాల్సిన అవసరం ఉంది. వారి అవసరాలకు అనుగుణంగా వారితో మమేకమవుతూ మనలో ఒకరిగా కలుపుకుపోతూ వారిలోని ఆవేదనను గుర్తించి సహకరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా కృషి చేస్తా. భవిత కేంద్రంలో పౌష్టికాహారం అందిస్తూ ప్రతీ విద్యార్థికి థెరపిలు అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ప్రతీ ఒక్కరిని భవిత కేంద్రంలో నమోదయ్యేలా తల్లిదండ్రులు కృషి చేయాలి. వారికి ఆటో చార్జీలు, ఇతర సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుంది.

ఇలా త్రిపాఠి, కలెక్టర్, నల్లగొండ

సాధారణ పిల్లలతో పోటీ పడేలా



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను సాధారణ పిల్లలతో పోటీపడేలా తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని వారికి భరోసాగా నిలబడాలి. ప్రతీరోజు పాఠశాలకు హాజరయ్యే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్ అలవెన్స్ అందించడంతోపాటు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, ట్రై సైకిళ్లు తదితర ఉపకరణాలను అందిస్తాం.

నారాయణ్‌అమిత్, సబ్ కలెక్టర్, మిర్యాలగూడ

నిరంతరం అందుబాటులో ఉంటాం



నిరంతరం అందుబాటులో ఉంటూ వారి విద్యావిధానాన్ని పరిశీలిస్తుంటాం. పరిపక్వత చెందని విద్యార్థులను గుర్తిస్తూ వారి మానసిక ఎదుగుదలకు అనుగుణంగా సంబంధిత విద్యా అంశాలను ఎప్పటికప్పుడు అందిస్తాం.

బైరోజు బ్రహ్మచారి, స్పెషల్ టీచర్, మిర్యాలగూడ

నడక నేర్చుకున్నారు



తొమ్మిదేళ్ల క్రితం నడవలేని స్థితిలో ఉన్న మా బాబును భవిత కేంద్రంలో చేర్పించాను. నాడు నిలబడి నడవలేని స్థితిలో ఉన్నాడు. నాటినుంచి భవిత కేంద్రంలో విద్యతోపాటు చేపడుతున్న థెరపిలతో అంచెలంచెలుగా అడుగులువేస్తూ నేడు తన అవసరాలను గుర్తించేలా మానసిక ఎదుగుదలతోపాటు నడుస్తున్నాడు.

జ్యోతి, విద్యార్థి తల్లి, సుబ్బారెడ్డిగూడెం

రాష్ట్ర స్థాయికి సిటీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



సాత్విక్



మానస

సూర్యాపేట టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థి విజ్ఞాన్ మంతన్ (వీవీఎం) జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో రాష్ట్ర స్థాయి పోటీలకు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సిటీ హైస్కూల్, సిటీ ఎలైట్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల చైర్మన్ ఆర్.ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాలలో బుధవారం ఆయన అభినందించి మాట్లాడారు. జాతీయ స్థాయి పరీక్షలో 9వతరగతికి చెందిన సిటీ హైస్కూల్ విద్యార్థి వి.సాత్విక్, 9వ తరగతికి చెందిన సిటీ ఎలైట్ స్కూల్ విద్యార్థిని బి.మానస ఉత్తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీధర్, కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజేష్ మృతికి కారకులపై అట్రాసిటి కేసు నమోదు చేయాలి

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హుస్సేన్



కోదాడలో రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు.

కోదాడ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన దళిత యువకుడు రాజేష్ మృతి కి కారకులపై 306, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం కింద కేసు నమోదు చేయాలని, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది తల్లమల్ల హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోదాడలో రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సీఎం రిలీఫ్ ఫండ్‌లో అక్రమాలు జరిగాయని పోలీసులు రాజేష్‌ను అదుపులోకి తీసుకుని నాలుగు రోజుల పాటు చిలుకూరు, కోదాడ రూరల్ స్టేషన్లలో చిత్రహింసలు పెట్టడం కారణంగానే మృతి చెందాడన్నారు. వెంటనే రిటైర్డు హైకోర్టు జడ్జీ పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఐదు ఎకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.కోటి పరిహారం అందించాలని, లేనట్లయితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడతల శ్రీనివాస్, దాసరి దేవయ్య, లచ్చిమళ్ల రామ్మోహన్‌రావు, గాదరి మధు, కాసిమల్ల వెంకటనరసయ్య, పిడతలశంకర్, ఏపూరి రాజు , కొండపల్లి ఆంజనేయులు, యలమర్తి రాము, వడ్డేపల్లి కోటేష్, ఏపూరి సత్యరాజు, సోమపంగు సురేష్, పాముల శ్రవణ్, రాయల గోపి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

సూర్యాపేట టౌన్: పోలీసుల కస్టడీలో మృతి చెందిన కోదాడకు చెందిన రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాని ఎంఎస్పీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్యమాదిగ కోరారు. బుధవారం సూర్యాపేటలోని లోని బాబుజగ్జీవన్‌రామ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్‌ఎఫ్ నిధుల కేసుకు సంబంధించి అరెస్టు చేసిన రాజేష్‌ను వివిధ పోలీస్ స్టేషన్‌లకు తిప్పుతూ చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే చలో కోదాడ కర్ల రాజేష్ సంతాప సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలపాటి చిన శ్రీరాములు, వలపట్ల దయానంద్, బోడ శ్రీరాములు, గార కనకయ్య, బొడ్డు విజయ్‌కుమార్, మేడికృష్ణ, లింగస్వామి, సతీష్, శ్రీనివాస్, కిరణ్, గోపిచంద్, మనోజ్ పాల్గొన్నారు.

దొరికినా తీరు మారడం లేదు..

● అవినీతి కేసుల్లో పట్టుబడుతున్న అధికారులు ● ఏటా పెరుగుతున్న కేసులు ● ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 15 కేసులు నమోదు ● నేటినుంచి అవినీతి వ్యతిరేక వారోత్సవాలు



ప్రభుత్వం అనేక విధాలుగా చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో అవినీతి నిరోధించలేక పోతున్నారు. ఏ శాఖలోనైనా పైసలు ఇవ్వనిదే ఫైలు కదలడంలేదు. ప్రసవించాలంటే ఆసుపత్రుల్లో, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మున్సిపాలిటీల్లో, విద్యుత్ మీటర్, ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే ట్రాన్స్‌కోలో, రైతులకు పాస్ పుస్తకాలు కావాలంటే రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖతో పాటు ప్రతిశాఖలో కొంతమంది అవినీతిపరులు ఉంటున్నారు. దీంతో పనులు కాక ప్రజలు సతమతమవుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, సూర్యాపేటక్రైం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవినీతి నిరోధక శాఖాధికారులు ఈఏడాది ఇప్పటి వరకు 15కేసులు నమోదు చేశారు. అందులో పలు కేసులు రెడ్‌హ్యాండెడ్‌గా డబ్బులు తీసుకుంటుండగా కేసులు నమోదు చేశారు. మరో ఆరు ఆకస్మిక తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. అందులో భాగంగా రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖ, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు. అవినీతి శాఖాధికారులు లంచాలు తీసుకునే అధికారులు, ఆదాయానికి మించి అక్రమ మార్గంలో ఆస్తులు కూడబెట్టుకున్న వారిపై దాడులు చేసి కేసులు నమోదు చేసి జైలుకు పంపినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగుల్లో మార్పు రావడంలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవినీతి నిరోధక శాఖాధికారులు నమోదు చేసిన సుమారు 50కేసులు విచారణ విషయంలో పెండింగ్‌లో ఉన్నాయి.

ఈ ఏడాది నమోదైన కేసులు

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు అవినీతికి పాల్పడిన అధికారులు, ఉద్యోగులపై 15 కేసులు నమోదు చేశారు. జనవరిలో డిండి మండలంలో రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ శ్యాంనాయక్, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు, ఫిబ్రవరిలో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల సర్వేయర్ రవి, చౌటుప్పలోని విద్యుత్ శాఖలో ఏడీఈగా పని చేస్తున్న శ్యాంప్రసాద్, సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి, సూర్యాపేట డీఎస్పీ పార్థసారధి, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, నల్లగొండలోని సివిల్ సప్లయ్ విభాగంలో పనిచేసే జావెద్, సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలోని అన్నారం గ్రామపంచాయతీ కార్యదర్శి సతీష్, హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ విజేతరెడ్డి, కోదాడలోని అటవీ శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బీట్ ఆఫీసర్ వెంకన్న, నల్లగొండ జిల్లా మత్స్యశాకాధికారి చరిత, చిట్యాల తహసీల్దార్ గుగులోత్ క్రిష్ణ, ప్రైవేట్ ఉద్యోగి రమేష్, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం జానపహాడ్ పంచాయతీ కార్యదర్శి వింజమూరి వెంకన్న, నల్లగొండ అగ్నిమాపక అధికారి సత్యనారాయణరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట దేవస్థానం ఈఈ వెంకట నారా యణ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అదే విధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా సరిహద్దుల్లో ఉన్న రవాణా శాఖ చెక్ పోస్టులు, పలు సంక్షేమ శాఖలకు సంబంధించిన హాస్టళ్లు, రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

లంచం అడిగితే...

ప్రభుత్వ ఉద్యోగులు వివిధ పనుల నిమిత్తం లంచాలు అడిగితే ప్రజలు జిల్లాలోని అవినీతి నిరోధక శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలి. సదరు ఉద్యోగులపై ఏ విషయంలో ఫిర్యాదు చేసేది లిఖిత పూర్వకంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అక్రమార్గంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడపెట్టిన వారి విషయాలను ఫోన్ ద్వారా తెలియజేస్తే సరిపోతుంది. అవినీతి నిరోధక శాఖకు సంబంధించిన క్యూఆర్ కోడ్ ద్వారా కూడా సమాచారం ఇవ్వవచ్చు. సమాచారం ఇచ్చిన వారి విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతారు.

ప్రజలు సహకరించాలి

అవినీతిని నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలి. కళాజాతల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అయినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గడం లేదు. అవినీతి నిర్మూలన బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించినప్పుడే సాధ్యమవుతుంది. గతంలో నమోదు చేసిన కేసులకు సంబంధించిన కొంత మంది ఉద్యోగులకు ఇటీవల కోర్టుల్లో శిక్ష పడింది. వారం రోజుల పాటు ప్రజలు, విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవ గాహన కల్పించే కార్యక్రమాలు చే పడుతున్నాం. ప్రజలు అవినీతి ఉద్యోగులపై ఫిర్యాదు చేయాలంటే టోల్‌ఫ్రీ నెంబరు: 1064, సెల్: 9154388918లకు ఫోన్ చేయాలి.

● జగదీష్‌చందర్, ఏసీబీ డీఎస్పీ, నల్లగొండ.

శస్త్ర చికిత్సతో గొర్రె పిల్లకు ప్రాణం



కోదాడలో గొర్రె పిల్లకు శస్త్ర చికిత్స చేస్తున్న పశు వైద్యులు

కోదాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొట్ట పగిలి పేగులు బయటికి వచ్చిన గొర్రె పిల్లకు శస్త్ర చికిత్సతో ప్రాణం పోసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు. పట్టణంలోని కొమరబండ వార్డుకు చెందిన గొర్రెల కాపరి బొమ్మకంటి వీరయ్య గొర్రె నెలరోజుల క్రితం పిల్లకు జన్మనిచ్చింది. మూడు కాళ్లతోనే పుట్టిన ఆ గొర్రెపిల్ల 15 రోజుల వరకు గెంతుతూ హుషారుగానే ఉంది. మందలో ఉండగా, ఏదో జంతువు దాని కడుపులో పొడిచింది. పొట్ట కింది భాగంగా చిన్న గడ్డగా మారి రోజురోజుకి పెరిగింది. పొట్ట అడుగులో బక్కి పగిలి మూడో వంతు పేగులు బయటకు వచ్చి వేలాడుతుండడంతోపశు వైద్యశాలకు బుధవారం తీసుకువచ్చారు. గొర్రెపిల్లను పరిశీలించిన అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య గంటన్నరకు పైగా శస్త్ర చికిత్స చేశారు.. పేగులు, పొట్ట భాగాలను బక్కిలోకి వేసి పగిలిన పొట్ట భాగాన్ని మూడు వరుసలుగా కుట్టువేశారు. ఈ శస్త్ర చికిత్సలో సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్, హరికృష్ణ పాల్గొన్నారు.

వాలీబాల్ జాతీయ కెప్టెన్‌గా సింధు ఎంపిక



తుంగతుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పదో తరగతి చదువుతున్న కె. సింధు అంతర్జాతీయ వాలీబాల్ టీంకు కెప్టెన్‌గా ఎంపికైంది. పుణెలో జరిగిన జాతీయ పోటీల్లో ప్రతిభ చాలింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె. సంధ్యారాణి, సిబ్బంది అభినందించారు.

ఆధునిక వసతులతో అన్నసత్రం

● ఏకకాలంలో 1000 మందికి వితరణ

● రోజులో 2 వేల నుంచి 5 వేల మందికి అవకాశం



అన్నసత్రంలో భోజనం చేస్తున్న భక్తులు


(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా ఆధునిక వసతులతో అన్నదానం సత్ర భవనం అందుబాటులోకి వచ్చింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలో బస్టాండ్ సమీపంలో కొత్తహంగులతో నూతన భవనం నిర్మించారు. విశాలమైన భవనంలో కూరగాయలు నిల్వ చేసేందుకు గదులు, పెరుగు, పాలు కోసం ఫ్రిజ్‌లు, ప్రముఖులకు ప్రత్యేకంగా భోజనం చేసేందుకు వసతులు సమకూర్చారు. ఉచితంగా, పరిశుభ్రంగా పోషకాహారం, నాణ్యత ప్రమాణాలతో కూడిన భోజనం అందిస్తున్నారు.

నూతన అన్నదాన సత్ర భవనంలో రెండు డైనింగ్ హాళ్లలో ఏకకాలంలో 1,000 మంది భోజనం చేసేలా పెద్దగా నిర్మించారు. రెండు వెయిటింగ్ హాళ్లు, 12 స్టోర్‌రూం, కేటాయించిన భూమిలో 25శాతం సువిశాలమైన వంటల గది, కూరగాయలు భద్రపర్చేందుకు గదులు, పెరుగు, పాలు కోసం ఫ్రిజ్, 20మంది ప్రముఖులకు ప్రత్యేకగదులను అందుబాటులోకి తెచ్చారు. భక్తులు కూర్చుని భోజనం చేసేందుకు కుర్చీలు, టేబుళ్ల దాత సహకారంతో భవన ఆవరణలో ప్రత్యేకంగా జల ప్రసాదం సిద్ధం చేశారు. తొలుత 200 మందితో ప్రారంభించిన అన్నదాన పథకం 1000 మందికి చేరింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు 1000 నుంచి 1,500 మంది భక్తులకు అన్నదాన సదుపాయం కల్పిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు విడతల వారీగా 2వేల నుంచి 5వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించే సౌకర్యం ఉంది.

కొండకింద ఆధ్యాత్మిక వాడలో సుమారు రూ.23 కోట్లు వెచ్చించి 2.07ఎకరాలకు 1.20 ఎకరాల్లో నూతన భవనం నిర్మించారు. నవంబరు 30న ఈ అన్నసత్ర భవనాన్ని ప్రారంభించారు. 2021లో నిర్మాణం చేపట్టగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా గణపవరం దాత వేగేశ్న అనంతరకోటీరాజు అందించిన విరాళం రూ.14కోట్లు, మిగతాపనులు కావాల్సిన నిధులు వైటీడీఏ (భవనం పునాదులు), దేవస్థానం (గ్యాస్‌స్టౌవ్, పైపులైన్, బాయిలర్లు, ఇతర సామాగ్రి) భాగస్వామ్యంతో అన్నదానం కొనసాగుతోంది. ఆధునిక వంటపరికరాలు,పాత్రలు శుభ్రంచేసే యంత్రాలు ఏర్పాటుచేశారు.

రోజూ 1000 మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నాం



ప్రస్తుతం రోజుకు 1000 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నాం. నిత్యం 2వేల నుంచి 5వేల మంది భక్తులకు వితరణ చేసే సౌకర్యం ఉంది. విశాలమైన భవనంలో సౌకర్యవంతంగా వసతుల నడుమ నిత్యం భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. భక్తులు విరివిగా అందజేసే విరాళాలతో మరింత భక్తుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం.

భాస్కరాయణీ నరసింహమూర్తి, దేవస్థానం అనువంశిక ధర్మకర్త

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను అభిషేకరించి, తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండీజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 15,23,421 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

వైభవంగా నిత్యకల్యాణం



మట్టపల్లిలో గరుడసేవలో భక్తులు

మఠంపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో బుధవారం నిత్యకల్యాణ్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. కల్యాణంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వార్థరహితమే దైవసన్నిధికి మార్గం



వార్షికోత్సవాల్లో ప్రసంగిస్తున్న ఫాదర్ రాజారెడ్డి



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మఠంపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వార్థరహిత జీవనం సాగించే వారికే దైవసన్నిధికి చేరుకునే మార్గం సిద్ధిస్తుందని విచారణ గురువు ఫాదర్ గోగుల రాజారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రం శౌరీనగర్‌లోని పునీతశౌరీ దేవాలయ వార్షికోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవాళి జీవనసరళి పాపభీతి, ఆధ్యాత్మిక చింతనలతో సాగాలని ఉద్బోధించారు. ప్రతీ వ్యక్తిలో దైవత్వాన్ని చూడాలన్నారు. సాటిమనిషికి సాయం చేయడంలోనే దైవసేవ దాగి ఉంటుందన్నారు. ఏసుమార్గంలో నడవాలన్నారు. సాయంత్రం పురవీధుల్లో బాల ఏసు ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై భక్తులు గీతలాపాన చేస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో విచారణ గురువులు మరయ్య, అశోక్, జోసఫ్, శౌరి, సాగర్ సిస్టర్లు, పునీత దేవాలయ కమిటీసభ్యులు, గ్రామపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచులు వీరే..

తిప్పర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తిప్పర్తి మండలంలో మూడు గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల వ్యాప్తంగా 26 గ్రామ పంచాయతీలు ఉండగా మర్రిగూడెం, కంకణాలపల్లి, సోమోరిగూడెం గ్రామాల సర్పంచ్ అభ్యర్థులను ఏక్రగీవంగా ఎన్నుకున్నారు. కాగా ప్రస్తుతం పోటీలో ఉన్న 23 గ్రామ పంచాయతీల నుండి మొత్తం 65 అభ్యర్థులు బరిలో నిలిచారు.

శాలిగౌరారం : శాలిగౌరారం మండల కేంద్రం సర్పంచ్‌గా గుజలాల్ శేఖర్‌బాబు (కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాలిగౌరారం సర్పంచ్ పదవికి 16మంది నామినేషన్లు వేయగా బుధవారం 3గంటల వరకు 14మంది అభ్యర్థులు విరమించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న చిత్తలూరి జీడికల్లు చివరి క్షణంలో విత్‌డ్రా చేసుకోగా బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న గుజలాల్ శేఖర్ బాబు ఒక్కడే పోటీలో ఉండటంతో అధికారులు శేఖర్ బాబును సర్పంచ్‌గా ప్రకటించారు. నామినేషల విత్‌డ్రాకు ముందు బీఆర్ఎస్‌లో ఉన్న శేఖర్‌బాబు చివరి క్షణంలో కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయ పరిణామాలు చోటు చేసుకోవడంతో అందరూ అవాక్కయ్యారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ సైదులు బందోబస్తు చేపట్టారు.

మండలంలోని పలు గ్రామపంచాయతీలలో 19 వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యాయని శాలిగౌరారం ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి తెలిపారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గుజలాల్ శేఖర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో వార్డు మెంబర్లు ఏకగ్రీవ వివరాలు ఇలా ఉన్నాయి. బండమీది గూడెం 1వ వార్డు, అడ్లూరులోని 5వ వార్డు, ఇటుకులపహాడ్‌లోని 1వ, 6వ వార్డులు, జాలోనిగూడెంలోని 1,2,3,4,5,6,7 వార్డులు, మనిమద్దెలోని 8వ వార్డు, తిరుమలరాయునిగూడెం 3,4,8 వార్డులు, తుడిమిడిలోని 4వ వార్డు, ఉప్పలంచలోని 1వ వార్డు, వంగమర్తిలోని 10వ వార్డు ఏకగ్రీవాలు అయ్యాయి.

మర్రిగూడ : మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన కల్లెట్ల లింగయ్య సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి నేర్లకంటి యాదయ్య, సీపీఐ తరపున కల్లెట్ల లింగయ్య సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ పొత్తుల్లో భాగంగా డిసెంబరు 3న బుధవారం నేర్లకంటి యాదయ్య నామినేషన్ ఉప సంహరించుకున్నారు.

కట్టంగూరు : మండలంలో ఇద్దరు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో 22గ్రామపంచాయతీలు ఉండగా రెండు గ్రామపంచాయతీలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. మండలంలోని టీఆర్ఎస్ సర్పంచ్‌గా మల్లారం గ్రామం నుంచి పెద్ది నాగమణి, కాంగ్రెస్ బలపర్చిన దుగినవెల్లి గ్రామ సర్పంచ్ మల్లెబోయిన యాదయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కేతేపల్లి : మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ సర్పంచ్ పదవి ఏకగ్రీవమయ్యింది. బీసీ జనరల్‌గా ఉన్న ఈ గ్రామ సర్పంచ్ పదవికి కాంగ్రెస్, బీఆర్ఎస్ సానుభూతిపరులు చివరి రోజైన శనివారం నామినేషన్లు వేశారు. ఇరు పార్టీల నాయకులు నాలుగు రోజులుగా జరిపిన చర్చలు ఫలించి ఏకగ్రీవం కుదిరింది. ఈ మేరకు సర్పంచ్‌గా ఎన్నికయ్యే కాంగ్రెస్ అభ్యర్థి ఏర్పుల నాగరాజు గ్రామ అభివృద్ధికై రూ.5లక్షలు ఇచ్చే ఖరారు. ఈ గ్రామంలోని 8వార్డుల్లో 4వార్డులు ఏకగ్రీవంకాగా మరో 4వార్డుల్లో పోటీ జరగనుంది. ఇదిలా ఉంటే మండలంలోని బండపాలెం, చెరుకుపల్లి గ్రామాల్లో ఏకగ్రీవంకోసం చివరి వరకూ ప్రయత్నాలు జరిగినా అవి ఫలించలేదు. బండపాలెం గ్రామానికి చెందిన రెండు ప్రధాన పార్టీల నాయకులు కలిసి ఇటీవల రాతపూర్వకంగా చేసుకున్న ఒప్పందం బహిర్గతం కావడంతో గ్రామానికి చెందిన అసంతృప్తులు కొందరు నామినేషన్లు వేశారు. ఏకగ్రీవం చేయడంలో భాగంగా వారి నామినేషన్లు ఉపసంహరింపజేసినప్పటికీ వంగూరి జానయ్య అనే అభ్యర్థి ఉపసంహరణకు అంగీకరించకపోవడంతో ఇక్కడ ఏకగ్రీవం సాధ్యం కాకుండా పోయింది. శాసనమండలి మాజీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ స్వగ్రామం చెరుకుపల్లిలో సైతం ఏకగ్రీవ యత్నాలు ఫలించకపోవడంతో ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఏకగ్రీవం సాధ్యంకాకపోవడంతో చివరి నిమిషంలో ఇక్కడ నుంచి నామినేషన్ వేసిన నేతి కమలమ్మ తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని పోటీ నుంచి తప్పుకుంది.

చండూరురూరల్: మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను 18 గ్రామపంచాయతీలలో ఎన్నికలు ఎదావిదిగా సాగనున్నాయి. కేవలం ఒకే ఒక్క గ్రామపంచాయతీ చొప్పరివారిగూడెం గ్రామపంచాయతీ ఏకగ్రీవం అయ్యింది.

బీజేపీలో పలువురి చేరిక

చిట్యాలరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయగుబ్బ గ్రామానికి చెందిన పలువురు బుధవారం బీజేపీలో చేరారు. పార్టీలో మదన్‌మోహన్, దేశగాని శంకర్, రొడ్డ రవీందర్, మల్యాల యాదగిరి, సత్యనారాయణ, శ్రవణ్‌కుమార్, నరేందర్, లింగయ్య, బొడ్డు శ్రీను, ఎల్లె నర్సింహలు చేరగా వారిని పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానిస్తూ కండువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లి రామరాజుయాదవ్, చిట్యాల మండల అధ్యక్షుడు పీక వెంకన్నముదిరాజ్, ఆకుల వెంకన్న, మాస శ్రీను, విద్యాసాగర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కనగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎడవల్లి గ్రామానికి చెందిన ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ నేత కర్నాటి మల్లేష్ తండ్రి కర్నాటి పెద్దులు(70) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి పెద్దులు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాద వాశాత్తు తాటిచెట్టుపడి తీవ్రంగా గాయపడిన తాటికల్లు గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కారింగు రాములుకు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్ట్ సభ్యులు బుధవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తెలగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొండ వెంకన్న ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు నాతి గణేష్, బాల్నే రామచంద్రుడు కార్మికుడు కుటుంబాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎరుకల అంజయ్య గౌడ్, వెంకట్ గౌడ్, గోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, విద్య

బాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

చిట్యాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు బాలల సమస్యల పరిరక్షణకు కృషి చేయాలని మునిసిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ అన్నారు. చిట్యాల పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిశు విక్రయాలు, బాల్య వివాహాలు, అక్రమదత్తతలను అరికట్టాలని అన్నారు. బాలలపై లైంగిక వేధింపులు జరగకుండా ఏర్పాటయ్యే కమిటీలు పర్యవేక్షించాలన్నారు. బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.విద్య, ఐ.రాము, నర్సింగరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

శాలిగౌరారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. సర్పంచ్, వార్డు సభ్యులను అత్యధికంగా గెలిపించుకొనే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా సమరంరెడ్డి శాలిగౌరారం గ్రామ బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గుజలాల్ శేఖర్‌బాబుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిత్తలూరి జీడికల్లు, చామల వాసుదేవరెడ్డి, చామల జయపాల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, వడ్లకొండ పరమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కపట రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ : బీఆర్ఎస్

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్ ఎన్నికల్లో గెలవలేక కపట రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గుండా శ్రీనివాస్, బట్ట వీరబాబు విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. శాలిగౌరారం బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రలోభపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కల్లూరి నాగరాజు, నిమ్మల సురేష్, నాయకులు గోదల సురేష్ రెడ్డి, రాపాక రాజు, రాచకొండ గణేష్, బట్ట గణేష్, రూపని నాగరాజు, రమేష్, మహేష్, సతీష్, ధనుంజయ్ పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి ఆశయ సాధనకు కృషి చేయాలి

● స్వర్ణకార సంఘ పట్టణ అధ్యక్షుడు చోలేటి హరిప్రసాద్



శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చోల్లేటి హరిప్రసాద్

నల్లగొండరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడు సొల్లేటి హరిప్రసాద్ అన్నారు. శ్రీకాంతచారి వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే నీళ్ల నిధులు, నియామకాలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నా శ్రీకాంత్‌చారి కల నేడు నెరవేరకుండా పోతుందని అన్నారు. తెలంగాణ తొలివీరుడు శ్రీకాంత్‌చారి విశ్వబ్రాహ్మణ జాతిలో జన్మించడం విశ్వకర్మ జాతికే గర్వం కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తాడూరి చలమయ్యాచారి, జిల్లెపల్లి విజయ్‌కుమార్, అబ్దుల్లా, బ్రహ్మాచారి, దాసోజు వాసు, కటకం మహేష్, సొల్లేటి దేవిప్రసాద్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



గ్రామస్థులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ శంకర్

తిప్పర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తిప్పర్తి ఎస్ఐ శంకర్ అన్నారు. బుధవారం అభ్యర్థుల ఉపసంహరణ చివరి రోజు అయినందున అభ్యర్థులను ఎవరూ ఒత్తిడి చేయకుండా ఉండాలని సూచించారు. ఏ గ్రామంలోనైనా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోషల్ మీడియా గ్రూపుల్లో ఇతరులను విమర్శించే విధంగా ఉండే పోస్టులను, వీడియోలను అప్‌లోడ్ చేయవద్దని, అలా చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పంచాయతీ ఎన్నికల అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

నార్కట్‌పల్లి, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం ముగిసింది. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ పోరులో బరిలో నిలిచిన అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. నార్కట్‌పల్లి మండల వ్యాప్తంగా 88 మంది సర్పంచ్ అభ్యర్థులు, 540 మంది వార్డు సభ్యులు బరిలో నిలిచారు. మొత్తం 29 జీపీలకు గాను 2 జీపీలు ఏకగ్రీవం కాగా 27 జీపీల్లో సర్పంచ్ అభ్యర్థులు 88 మంది బరిలో ఉన్నారు. అదేవిధంగా 262 వార్డు స్థానాలకు గాను 35 వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 227 వార్డు స్థానాలకు 540 మంది అభ్యర్థులు బ్యాలెట్ పోరులో నిలిచారు.

కేతేపల్లి : సర్పంచ్ ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం మండలంలోని 16సర్పంచ్ స్థానాలకుగాను 15పంచాయితీలకు మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఉప్పలపహాడ్ గ్రామ పంచాయితీ సర్పంచ్ ఏకగ్రీవయ్యింది. ఏకగ్రీవమైన ఉప్పలపహాడ్ గ్రామ పంచాయతీ మినహాయించి మిగిలిన 15సర్పంచ్ స్థానాలకు 46మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 16గ్రామ పంచాయితీల్లోని 160వార్డులకుగాను 13వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన 13వార్డులు మినహాయించగా మిగిలిన 147వార్డులకు 342మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మండలంలోని 16గ్రామాల సర్పంచ్‌ల పదవులకై 135మంది, 160వార్డులకు 456మంది నామినేషన్లు దాఖలు చేయగా సర్పంచ్ అభ్యర్థులు 89మంది, వార్డుల అభ్యర్థులు 114మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులకు అధికారులు బుధవారం సాయంత్రం గుర్తులను కేటాయించారు. అయా గ్రామాల్లో సర్పంచ్ పదవికి పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

చండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలు మండలంలో ఎంతో రసవత్తరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిని ఇటీవల 73 లక్షల రూపాయలకు గ్రామస్థులు అన్ని పార్టీల నాయకులు వేలం ద్వారా ఏకగ్రీవం చేసిన సంగతి విదితమే. కాగా ఇటీవల అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ ఏకగ్రీవంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా గ్రామంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. గ్రామంలో ఎక్కడ చూసినా ఇదే చర్చ జరిగి, చివరికి ఎన్నికలను యథావిధిగా సాగే దిశగా చేసింది. గ్రామంలో సర్పంచ్ పదవికి మొత్తం 11 మంది అభ్యర్థులకు గాను 16 నామినేషన్లు అందగా అందులో 9 నామినేషన్లు ఉపసంహరించుకుని 7 మంది బరిలో ఉన్నారు.



చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గుర్తులు చూసుకుంటున్న అభ్యర్థులు

చిట్యాలరూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో చిట్యాల మండలంలో18 గ్రామాలకు గాను 45మంది సర్పంచ్ అభ్యర్థులు, 167 వార్డులకు గాను 433మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని చిట్యాల ఎంపీడీఓ ఎస్‌పి. జయలక్ష్మి తెలిపారు. మండలంలోని నేరడ గ్రామంలో 12వార్డుకు గాను 10 (1-5, 8-12) వార్డు సభ్యులు ఏకగ్రీవమైనారని, అదే విధంగా ఆరెగూడెంలో 3వ వార్డు, వనిపాకలలో 5వ వార్డు, బొంగోనిచెర్వులో 8వ వార్డు ఏకగ్రీవమైనాయని పేర్కొన్నారు.

మునుగోడు : మునుగోడు మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. మండలంలోని 28గ్రామాల్లో 95మంది సర్పంచి అభ్యర్థులు, ఆయాగ్రామాల్లో 244వార్డులు ఉండగా 32 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 212వార్డులల్లో 538మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నిర్దేశించిన ఎన్నికల నియమావళి ప్రకారం బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులను కేటాయించినట్లు ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీలో పాలకూరి రమాదేవి నరసింహగౌడ్, కర్నాటి పద్మ స్వామియాదవ్, కర్నాటి లక్ష్మీ శ్రీనివాస్ నేత, జిట్టగోని మనోహర యాదయ్యముదిరాజ్, బొడ్డు శ్రావణి నాగరాజు గౌడ్‌లు బరిలో ఉన్న వారందరికీ గుర్తులు కేటాయించామని ఆయన తెలిపారు. దీంతో తొలి అంకానికి తెరపడింది. బరిలో నిలిచిన అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించటంతో ప్రధానమైన ఘట్టం ఎన్నికల ప్రచార పర్వం గ్రామాల్లో ప్రారంభమైంది. ఇప్పటికే గ్రామాల్లో తొలి విడత ప్రచారాన్ని కొందరు అభ్యర్థులు పూర్తి చేసుకున్నారు. మంది మార్బలం, హంగు హార్బాటాలతో మలి విడత ప్రచారాలు చేస్తున్నారు. ఇలా సాగుతున్న ఎన్నికల ప్రచారాలతో గ్రామాల్లో సందడి రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాకూబ్‌నాయక్

నల్లగొండ, మర్రిగూడ, చిట్యాల, కనగల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అధైర్యపడకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలని ఎంపీడీవో యాకూబ్‌నాయక్, ఎంఈవో అరుంధతి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులందరికీ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బత్తుల భాస్కర్ అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు పణికుమార్, నాయకులు బొడ్డు నాగయ్య, ప్రధాన కార్యదర్శులు వీరమల్ల శ్రీనివాస్‌గౌడ్, కడారి కృష్ణ, ఉపాధ్యాయుడు శైలజ, రూప, భాస్కర్, చంద్రమోహన్, వాణి, భారవి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మండలకేంద్రంలోని భవిత సెంటర్ దామరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆధ్వర్యంలో దివ్యాంగులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బిట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నారు. దివ్యాంగులు విద్యపై శ్రద్ధచూపి అన్ని రంగాలల్లో ముందుండాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం ఉదావత్ లచ్చిరాం నాయక్, విజయలక్ష్మి, రేణుక, కల్పన, రమేష్, మాస బాలరాజు, వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

చిట్యాల: దివ్యాంగులు అన్ని విధాలుగా ఎదిగేందుకు అందరూ సహకరించాలని, వారిని చిన్నచూపు చూడవద్దని ఎంఈవో సైదానాయక్ అన్నారు. చిట్యాలలోని భవిత సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు సేవ చేయడం భగవంతుడికి సేవ చేయడమేనన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ, ఆర్ఐ షరీఫ్, ఎంపీవో కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్: కనగల్ మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా ఆటలు, పాటల పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఎంఈవో పద్మ బహుమతులను అందజేసి మాట్లాడారు. దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధి కోసం భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయని వివరించారు. భవిత కేంద్రాల్లో స్పీచ్, ఫిజియోథెరపీతో పాటు పిల్లలకు రవాణా సౌకర్యం ఉంటదన్నారు. చినమాదారం హైస్కూల్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థిని జి.దివ్యకు పాఠశాల ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ఆర్థికసాయంతో అభ్యసన సామగ్రిని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎం స్వుజనాకుమారి, ఐఈఆర్‌టీ బి.సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునుగోడు: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంఈవో మల్లేశం, హైస్కూల్, ఎంపీపీఎస్ హెచ్ఎంలు బాలప్రసాద్, సుంకరి బిక్షంగౌడ్, ప్రత్యేక ఎడికేటర్, ఉపేందర్, లక్ష్మీప్రసన్న, భవిత, ఇన్‌చార్జి ఇందిర, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

● మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

రామగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో వ్యర్థ పదార్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని, ఈ మేరకు అవసరమైన యంత్రాల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం బయో మైనింగ్ ఏజెన్సీ నిర్వాహకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమన్నారు. అనంతరం బయో మైనింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్లు అశోక్, కార్తీక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్

బీజేపీలో పలువురి చేరిక

చిట్యాలరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయగుబ్బ గ్రామానికి చెందిన పలువురు బుధవారం బీజేపీలో చేరారు. పార్టీలో మదన్‌మోహన్, దేశగాని శంకర్, రొడ్డ రవీందర్, మల్యాల యాదగిరి, సత్యనారాయణ, శ్రవణ్ కుమార్, నరేందర్, లింగయ్య, బొడ్డు శ్రీను, ఎల్లె నర్సింహలు చేరగా వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు.

మొదటి విడతలో హోరాహోరీ

(5వ పేజీ తరువాయి)


నెలకొంది. బీఆర్ఎస్ అన్ని పంచాయతీల్లోనూ అభ్యర్థులను రంగంలోకి దించడంతో పోటీ తప్పలేదు. నియోజకవర్గంలో సర్పంచ్ పదవులన్నింటికీ కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు ప్రయత్నిస్తుంటే, ప్రతిచోటా బలమైన పోటీ ఇవ్వడంతో పాటు, వీలైనన్ని పంచాయతీల్లో పాగావేయాలనే సంకల్పంతో బీఆర్ఎస్ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి.

రెండో విడత భారీగా నామినేషన్లు

జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరిగే మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్‌లోని 280 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 2,057 నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక్కో పంచాయతీకి సగటున ఏడుగురికిపైగా అభ్యర్థులు పోటీపడుతున్నారు. మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలతో పాటుగా అతిస్వల్పంగా నల్లగొండ నియోజకవర్గంలోని గ్రామాలు ఈ డివిజన్‌లో ఉన్నాయి. ఇక్కడ అన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ నుంచి నలుగురు, ఐదుగురు వరకు అభ్యర్థులు సర్పంచ్ పదవిని ఆశిస్తూ నామినేషన్లు దాఖలు చేయగా, బీఆర్ఎస్ అన్ని పంచాయతీల్లో అభ్యర్థులను నిలబెట్టింది. సీపీఎం సైతం అభ్యర్థులు పోటీచేసే చోట మద్దతుగా నిలిచి అవసరమైతే కాంగ్రెస్, లేకపోతే బీఆర్ఎస్ స్థానిక నేతలతో అవగాహన కుదిర్చేందుకు సన్నాహాలు చేస్తోంది. నాగార్జునసాగర్ నియోజకవర్గం అనుముల మండలంలోని పేరూరు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్టీకి కేటాయించగా, ఈ గ్రామంలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేకపోవడంతో సర్పంచ్ పదవికి ఒక్క నామినేషన్ కూడా దాఖలవలేదు. అయితే ఎస్టీ జనాభా లేనిచోట ఎస్టీకి ఎలా రిజర్వ్ చేస్తారనే ఆగ్రహంతో గ్రామస్థులు వార్డు సభ్యుల పదవులకు సైతం నామినేషన్లు వేయకుండా ఎన్నికలను బహిష్కరించారు. మిగిలినచోట్ల అధికార పార్టీలో సర్పంచ్ పదవులను ఆశిస్తూ నలుగురైదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో బలమైన అభ్యర్థులను బరిలో ఉంచి, మిగిలినవారిని తప్పించేందుకు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు బుజ్జగింపుల పర్వం ప్రారంభించారు. సర్పంచ్ పదవికి పోటీ నుంచి తప్పుకుంటే భవిష్యత్‌లో సమానస్థాయిలో ఎంపీటీసీ, సింగిల్‌విండో ఛైర్మన్, మార్కెట్ డైరెక్టర్లు, దేవాలయ కమిటీల పదవులు ఇప్పిస్తామని, అదేవిధంగా ఆర్థికంగా ఉపయుక్తమయ్యేలా కాంట్రాక్టులు, ఇతరపనులు ఇప్పిస్తామని, పార్టీ పదవుల్లో బాధ్యతలిచ్చి గౌరవిస్తామనే హామీలతో చర్చలు ప్రారంభించారు. డివిజన్‌లో ఎన్నికలు జరిగే పంచాయతీల్లో కొన్నిచోట్ల ఏకగ్రీవాలకు సైతం అంతర్గతంగా చర్చలు మొదలయ్యాయి. పోటీచేసి పరస్పరం విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టడం కంటే గ్రామాభివృద్ధికి ఆ నిధులు కేటాయించి ఏకగ్రీవం చేసుకుందామనే ప్రతిపాదనలు చేస్తున్న గ్రామపెద్దలు అభ్యర్థులతో చర్చిస్తున్నారు.

మూడో విడతకు మొదలైన నామినేషన్లు

జిల్లాలో మూడో విడత ఎన్నికలు జరిగే తొమ్మిది మండలాల్లోని 269 గ్రామపంచాయతీలు, 2,206 వార్డు స్థానాలకు బుధవారంనుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. చింతపల్లి మండలంలోని తక్కెళ్లపల్లి పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్‌కు కేటాయించగా, ఆ కేటగిరికీ చెందిన ఓటర్లు లేకపోవడంతో అక్కడ వార్డు సభ్యులకు మాత్రమే ఎన్నిక జరగ నుంది. అదే విధంగా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీని ఏకగ్రీవం చేసినందుకు సర్పంచ్ అభ్యర్థి పి.వెంకటయ్య రూ.51.30లక్షలతో గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, శివాలయ నిర్మాణం చేస్తానని అంగీకరించారు. ఈ గ్రామం సైతం చిన్నపంచాయతీనే అయినా, సర్పంచ్‌గా ఏకగ్రీవంగా అంగీకరించిన వెంకటయ్య రాజకీయాల్లో ఉన్న వ్యక్తికావడంతో పాటు, రియల్‌ఎస్టేట్ వ్యాపారి కావడంతో ఈ వ్యయానికి అంగీకరించారు. గుర్రంపోడు మండలం ములకలపల్లిలోనూ రామాలయం నిర్మించేందుకు ముందుకువచ్చిన బొడ్డులింగస్వామిని సర్పంచ్‌గా ఏకగ్రీ వం చేయాలని నిర్ణయించారు. అందుకోసం ఎంత ఖర్చయినా ఆయనే వెచ్చించాలని నిర్ణయించారు. తాజాగా, బుధవారం నేరేడుగొమ్ము మండలం పేర్వాల గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్ నాయకుడు వీరమల్ల రామకృష్ణను ఏకగ్రీవం చేయాలని, అందుకోసం గ్రామంలో గుడి నిర్మాణం, బొడ్రాయి ప్రతిష్ఠకు రూ.36లక్షల వరకు వెచ్చించాలనిగ్రామస్థులు తీర్మానించారు. మిగిలిన 263 పంచాయతీలకు నామినేషన్లు మొదలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ నాటికి పెద్ద సంఖ్యలో ఏకగ్రీవాలయ్యే అవకాశం ఉందని అంచనావేస్తున్నారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	579.50 (281.5680)	15,445	15,445
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.76 (4.40)	727.42	171.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.3045)	640.62	702.43

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



తొలి విడతలో
హోరాహోరీ

జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో హోరాహోరీ పోరుకు తెరలేచింది. పార్టీరహితంగా జరగాల్సిన ఎన్నికలైనా, రాజకీయపార్టీల మద్దతుతోనే అభ్యర్థులు బరిలో నిలుస్తుండడంతో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. తొలి విడత నల్లగొండ, చండూరు డివిజన్లలో మొత్తం 14 మండలాల్లోని 318 గ్రామపంచాయతీల్లో బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. మొత్తంగా 21 గ్రామ పంచాయతీల్లో ఒకటే నామినేషన్ చొప్పున రావడంతో ఆయా పంచాయతీల సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. వీటిల్లో 18 పంచాయతీలు కాంగ్రెస్ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఎన్నికవగా, రెండు పంచాయతీల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు, ఒక పంచాయతీలో సీపీఐ మద్దతుదారుడు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

- 318 పంచాయతీలకు 21 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం
- 297 పంచాయతీల్లో పోటాపోటీ
- ప్రచార రంగంలోకి అభ్యర్థులు
- రెండో విడత పంచాయతీల్లో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- మూడో విడత పంచాయతీల్లో నామినేషన్ల పర్వం ప్రారంభం
- 269 పంచాయతీలు, 2,206 వార్డులు

జిల్లాలోని నల్లగొండ, చండూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 318 గ్రామపంచాయతీల్లో మొదటి దశలో ఎన్నికలు నిర్వహించున్నారు. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ బుధవారం సాయంత్రంతో ముగిసింది. మొత్తంగా 21 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 297 పంచాయతీల్లో హోరాహోరీ పోరుకు తెరలేచింది. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల పరిధిలోని ఈ గ్రామాల్లో కాంగ్రెస్‌కు ధీటుగా బీఆర్ఎస్ నాయకులు పోటీచేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్‌తో సీపీఐ అవగాహనతో పోటీచేస్తుండగా, బీఆర్ఎస్ నాయకులు దాదాపు అన్నిచోట్లా ఒంటరిగా పోటీచేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రం బీజేపీతో అవగాహన కుదుర్చుకొని బరిలో నిలిచారు. అన్ని పంచాయతీల్లో బీఆర్ఎస్ తరఫున బలమైన నాయకులు బరిలో నిలవడంతో పోటీ తీవ్రంగా ఉండనుంది. దీంతో ప్రతి ఓటూ కీలకమేనని ఆయా పార్టీల నేతలు భావిస్తున్నారు. ఈ పంచాయతీల్లో ఈనెల 11న పోలింగ్ జరగనుండడంతో వారం రోజులు గ్రామాల్లో ప్రచార సందడి కొనసాగనుంది. గ్రామపంచాయతీల్లో బలపరిచిన, మద్దతిచ్చిన అభ్యర్థులనే గెలిపించుకునే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. వందశాతం పంచాయతీలను గెలిపించుకోవాలనే సంకల్పంతో కాంగ్రెస్ నేతలు ఉండగా, ప్రతీ పంచాయతీలో బలమైన పోటీ ఇవ్వడంతో పాటు, వీలైనన్ని గెలవాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నేతలు పావులు కదుపుతున్నారు.

మంత్రి నజరానా ప్రకటించినా..

నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేస్తే ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షలకు తోడు, తాను మరో రూ.20లక్షల నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించినా నియోజకవర్గంలో ఆశించిన రీతిలో పంచాయతీల ఏకగ్రీవం కాలేదు. నియోజకవర్గంలో 88 గ్రామపంచాయతీలు ఉండగా, ఏడు పంచాయతీల్లో మాత్రమే స ర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 81 పంచాయతీల్లో పోటీ

మొదటి విడతలో ఏకగ్రీవ పంచాయతీలు ఇలా..

నియోజకవర్గం	ఏకగ్రీవ పంచాయతీలు
నల్లగొండ	బచ్చన్నగూడెం, తేలకంటిగూడెం, కంకణాలపల్లి, మర్రిగూడెం, సోమోరిగూడెం, రసూల్‌పురం, ఖుదావానిపూర్
మునుగోడు	కొట్టాల, చొప్పరివారిగూడెం కమ్మగూడెం, బండతిమ్మాపురం, ఫకీర్‌పురం, నామ్యానాయక్‌తండా, నెమళ్లగూడెం
తుంగతుర్తి	శాలిగౌరారం
నకిరేకల్	దాసరిగూడెం, శేర్‌బావిగూడెం, మల్లాపురం, దుగినేల్లి, ఉప్పలపహాడ్, గొల్లగూడెం

సమన్వయంతో ముందుకు సాగాలి

సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



పార్టీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న జానారెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేలా చూడాలని, పార్టీలో ఎక్కువ మంది సర్పంచ్, వార్డులకు పోటీపడుతుంటే సామరస్యంగా కూర్చొని చర్చించుకోవాలని సూచించారు. ఆయన వెంట హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాగం మంగమ్మ, నాగెండ్ల కృష్ణారెడ్డి, శాగం అంజిరెడ్డి, నాగిరెడ్డి, లింగారెడ్డి, నల్లబోతు సైదులు, అనుముల అంజయ్య, అనుముల సాలయ్య, అనుముల శ్రీను, మద్దెల వెంకన్న, ఆర్.వెంకటేశ్వర్లు, ఉన్నారు.

● మంత్రి మనుమరాలికి సీఎం ఆశీస్సులు



హైదరాబాద్‌లో బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మనుమరాలి బాలసారాకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ఆశీస్సులు అందజేశారు.



ఎల్లారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని రాజకీయ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడే ఎంజీ యూనివర్శిటీ, పక్కనే పవిత్ర దేవస్థానం ఉన్న కారణంగా ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. అదే తనకు ఇచ్చే బహుమతిగా భావిస్తానన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్, స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎరువుల విక్రయాలు

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



జిల్లా కేంద్రంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీచేస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

నల్లగొండ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయాలను పటిష్టంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ-పాస్ యంత్రాల ద్వారా విక్రయాలను తప్పనిసరి చేసిందని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వానాకాలంలో రైతులకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గత అక్టోబరు నుంచి ఈ-పాస్ యంత్రాల ద్వారా విక్రయాలను మరింత పటిష్టం చేసిందన్నారు. ఈ యంత్రంలో ఆధార్ నెంబరు ఎంటర్ చేయగానే వివరాలు చూపుతుందన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో యాసంగిలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలను జిల్లా ఎన్నికల అధికారులు బేఖాతర్ చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామానికి చెందిన చింతమల్ల కల్పన (అలియాస్ ధరావత్ కల్పన) నల్లగొండ శాసనసభ నియోజకవర్గంలోని 252 పోలింగ్‌స్టేషన్‌లో 951 సంఖ్యలో ఓటరుగా నమోదైందని అన్నారు. అయితే ఒత్తిడికి తలొగ్గి కలెక్టర్, అదనపు కలెక్టర్ ఓటర్ జాబితాలో చేర్చలేదన్నారు. సదరు ఓటరు హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు వాదనలు విన్న తరువాత ఓటును ఓటరు జాబితాలో చేర్చాలని కలెక్టర్‌ను సూచించిందన్నారు. సీపీఎం నాయకులు సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డితోపాటు ప్రతినిధి బృందం కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఈ విషయాన్ని విన్నవించగా ఓటరుగా నమోదుచేస్తామని చెప్పారన్నారు. అయినా అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి నామినేషన్ తిరస్కరిస్తున్నామని ప్రకటించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, హైకోర్టు ఆదేశాలను జిల్లా అధికారులు అపహాస్యం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే హైకోర్టు ఆదేశాల ప్రకారం కల్పన నామినేషన్‌ను ఆమోదించాలని, లేదంటే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌తోపాటు హైకోర్టుకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

లంచం అడగడం, తీసుకోవడం నేరం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



అవినీతి వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లంచం అడగడం తీసుకోవడం నేరమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఏసీబీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిపాలనలో పారదర్శకత అవసరమని, ఎవరైనా ప్రభుత్వాధికారి, ఉద్యోగి లంచం అడిగితే వెంటనే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చినవారి పేరును గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అవినీతిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, సోషల్ మీడియా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. వాట్సప్ నెంబర్‌కు 944044616 ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్, ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం ప్రత్యేక 'ప్రజావాణి'

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోటీల్లో దివ్యాంగులు క్రీడా స్ఫూర్తితో ఆడారన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక సామర్థ్యాలు పెంపొందించుకోవచ్చని అన్నారు. దివ్యాంగులకు సమాన హక్కులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, వారు బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.రమేష్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డీఈవో భిక్షపతి, జిల్లా క్రీడలు, యువజన సేవల అధికారి అక్బర్ అలీ, సీడీపీవో హరిత, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు, తిరుమలగిరి (సాగర్)): పంచాయతీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు దాఖలు చేసే నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని నిడమనూరు, ముకుందాపురం క్లస్టర్లలో, తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ల స్క్రూట్నీని ఆమె తనిఖీచేశారు. మండలంలో ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులను ప్రశ్నించగా, సర్పంచ్ పదవులకు 237, వార్డు సభ్యులకు 600 నామినేషన్లు వచ్చాయని అధికారులు వివరించారు. నామినేషన్ పత్రాల పరిశీలనను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. నామినేషన్ పత్రాలతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్‌పుస్తకాలు, తదితర పత్రాలు జత చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అభ్యర్థులు సమర్పిస్తున్న పత్రాలు పూర్తి సమాచారంతో ఉండేలా చూడాలన్నారు. అభ్యర్థులకు తగిన సమాచారం అందించడంతో పాటు నామినేషన్లపై అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, తహసీల్దార్లు జంగాల కృష్ణయ్య, అనిల్, ఎంపీడీవోలు హిమబిందు, భిక్షంరాజు, తదితరులు ఉన్నారు.

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



సీఎం సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

దేవరకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో ఈనెల 6న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నందున ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం దేవరకొండ చర్చి రోడ్డులోని స్థలాన్ని హెలీప్యాడ్, సీఎం సభ కోసం డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం పర్యటన నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను అనుసరించి వ్యవహరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, సీఐ వెంకట్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


నామినేషన్లను పరిశీలించాలి

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కేంద్రంలో అభ్యర్థితో పాటు ఒకరిద్దరికి మాత్రమే అనుమతించాలని, 100మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి రైతులు ఎక్కువగా ధాన్యం తీసుకొస్తున్నందున తేమ పరిశీలించి వేగంగా కాంటాలు వేసి ఎగుమతి చేయాలన్నారు. రవాణా సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో స్వర్ణలత, తహసీల్దార్ నరేందర్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, వాసికర్ల రమేష్, కోట్ల సతీష్, రాంరెడ్డి, సరస్వతి, పీఏసీఎస్ సీఈవో పల్లా తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతురత్న అవార్డు అందుకున్న అజయ్‌కుమార్‌రెడ్డి



అజయ్‌కుమార్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న మంత్రి తుమ్మల

చిట్యాలరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ వ్యవసాయంలో ఉత్తమ రైతుగా నిలిచిన మండల పరిధిలోని తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన రైతు పజ్జూరు అజయ్‌కుమార్‌రెడ్డి రైతురత్న అవార్డు అందుకున్నారు బుధవారం హైదరాబాద్‌లో పీజీపీఆర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు మేళాలో ఈ అవార్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందజేశారు. సమీకృత వ్యవసాయ విధానాన్ని అవలంభిస్తున్న అభ్యుదయ రైతు అజయ్‌కుమార్‌రెడ్డి మంత్రి తుమ్మల ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఏళ్లుగా సమీకృత వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తున్నట్టు తెలిపారు. రైతురత్న అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

దేవతలను అవమానిస్తే జాతిని కించపరిచనట్లే

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్

నల్లగొండ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవతలను అవమానపరిచేలా మాట్లాడడం హిందూజాతిని కించపరిచినట్లేనని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ ఇన్‌చార్జి వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని తగ్గించుకొని హిందూ దేవతలను ఉదాహరణగా పోల్చుతున్నారని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలను హిందూజాతి జీర్ణించుకోలేకపోతోందన్నారు. గతంలో కేసీఆర్ హిందువులు బంధువులు అని మాట్లాడితే కేసీఆర్ పాలనను ప్రజలు బొంద పెట్టారని, నేడు రేవంత్‌రెడ్డి కూడా అదే గతి పడుతుందన్నారు. హిందూ దేవతల గురించి మాట్లాడిన రేవంత్‌రెడ్డికి ఇతర మతస్థుల దేవతల గురించి మాట్లాడే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. హిందూ జాతిని అవమానపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ చరిత్రకు పునాది



శ్రీకాంతాచారి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ చరిత్రకు పునాది అని ఎంజీయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు వాడపల్లి నవీన్ అన్నారు. బుధవారం యూనివర్సిటీలో శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీకాంతాచారి త్యాగమే తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి మలుపుతిప్పిన ఘట్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు గాదె శివ, అక్షయ్, దినేష్, శ్రావణి, అలేఖ్య, పావని, తదితరులు పాల్గొన్నారు.

గడియారం సెంటర్‌లో..

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా గడియారం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటూరు వెంకటాచారి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, రమేష్, వెంకన్న, శంకరయ్య, దశరథ, తదితరులు పాల్గొన్నారు.



పల్లెపోరు.. సోషల్ మీడియా జోరు
● పంచాయతీ ఎన్నికలకు వేదికగా సామాజిక మాధ్యమాలు ● వాట్సప్ గ్రూపుల్లో అభ్యర్థుల ప్రచారం ● ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నాలు 6

భవితకు బాట
● ప్రత్యేక అవసరాల పిల్లలకు కొండంత అండ 7

వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ గడువు పెంచాలి

మహమ్మద్ షాహిద్ అహ్మద్

నల్లగొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ గడువును కేంద్ర ప్రభుత్వం పెంచాలని నల్లగొండ ఇఖామత్ బహదూర్ ఖాన్ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ షాహిద్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ షఫీ నవాజ్ ఖాన్‌లు కోరారు. బుధవారం ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయంలోని ఏవో మోతీలాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం వెబ్ పోర్టల్‌లో ఈ నెల 6వతేదీ వరకు గడువు విధించిందని, అయితే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదన్నారు. టెక్నికల్ ఎర్రర్ కారణంగా చాలా మసీదులు, ధార్మిక సంస్థలు, శ్మశాన వాటికలకు సంబంధించిన ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. 2026 జూన్ వరకు గడువు పెంచాలని కేంద్ర మైనార్టీశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి మహమ్మద్ ఖాజా ఫరీదుద్దీన్, తయ్యూబ్, తదితరులు పాల్గొన్నారు.

మొదలైన మూడో విడత నామినేషన్

● నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్



కొండమల్లేపల్లిలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో

దేవరకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లోని 269 గ్రామపంచాయతీల్లో మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా మండలాలలోని పలు గ్రామాల్లో సాయంత్రం 6 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. డివిజన్‌లో 226 గ్రామపంచాయతీలకు, 2206 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారులు డివిజన్‌లో 70 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో పురుషులు 1,40,913 మంది, స్త్రీలు 1,40,388 మంది, ఇతరులు 20 మంది మొత్తం 2,81,321 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

దేవరకొండలో 32 మంది సర్పంచుల నామినేషన్లు

దేవరకొండ మండలంలో 41 గ్రామపంచాయతీలు, 316 వార్డులకు బుధవారం 32 మంది సర్పంచ్ స్థానాలకు, 19 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు వేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దేవరకొండ డివిజన్‌లోని కొండమల్లేపల్లి గ్రామపంచాయతీలో కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. నేరేడుగొమ్ము మండలం పేర్వాల సర్పంచ్ పదవికై కాంగ్రెస్ అభ్యర్థి వీరమళ్ల రామకృష్ణ రూ.36లక్షల వరకు వేలంపాట పాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి బషీర్ రూ.35.50 లక్షల వరకు వేలంపాట పాడి ఆగిపోయారు. దీంతో అత్యధికంగా రూ.36 లక్షలకు వేలంపాట పాడిన రామకృష్ణను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసేందుకు గ్రామస్థులు నిర్ణయం తీసుకున్నారు. రూ.36లక్షల గ్రామాభివృద్ధికి కేటాయించాలని గ్రామ పెద్దలు తీర్మానం చేసినట్లు సమాచారం.

పీఏపల్లి ఉమ్మడి మండలంలో నామినేషన్ల సందడి

పెద్దఅడిశర్లపల్లి, నేరేడుగొమ్ము, గుడిపల్లి: పెద్దఅడిశర్లపల్లి ఉమ్మడి మండలంలో 37 సర్పంచులు, 320 వార్డులకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. పీఏపల్లి మండలంలో 6 క్లస్టర్లను, గుడిపల్లి మండలంలో 3 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు సహాయం నిమిత్తం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. నామినేషన్ పత్రాలు పరిశీలించి తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచిస్తున్నారు. మండలంలో మొదటి రోజు బుధవారం పలువురు ఉత్సాహంగా, ర్యాలీలతో సహా వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. పీఏపల్లి మండలంలో 20 మంది సర్పంచులకు, 11వార్డులకు నామినేషన్లు దాఖలయ్యాయి. అదే విధంగా గుడిపల్లి మండలంలో 21 మంది సర్పంచులకు, 36 వార్డులకు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో చంద్రమౌళి, అండాలు తెలిపారు. ఈ నెల 5న నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. నేరేడుగొమ్ము మండలంలో 17మంది సర్పంచులకు, 4 వార్డులకు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీవో జాన్‌అబ్రహం తెలిపారు.

డిండి: మండలంలోని 39 సర్పంచ్ స్థానాలకు బుధవారం 8 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో వెంకన్న తెలిపారు. శాంతిగూడెంలో 2, డిండిలో 1, వావిల్‌కోల్ 2, కుందేలుబావి తండా 1, నగరదుబ్బతండా 1, నిజాంనగర్ 1 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. 326 వార్డులకు గాను 13 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో వివరించారు.

గుర్రంపోడు: గుర్రంపోడు మండలంలో సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. మండలంలో 38 గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు 29 మంది నామినేషన్లు వేశారు. 318మంది వార్డు సభ్యులకు 40మంది వార్డు సభ్యులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో మహేష్ తెలిపారు.

చింతపల్లి: చింతపల్లి మండలంలో మొత్తం 36 గ్రామపంచాయతీల్లో 294 వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు 13 సర్పంచ్ అభ్యర్థులు, వార్డులకు 12మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు.

త్రిపురారం: త్రిపురారం మండలంలోని 9క్లస్టర్ గ్రామాల్లో మంగళవారం మూడో రోజు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థులు ముమ్మరంగా నామినేషన్లు రాత్రి 11గంటల వరకు వేశారు. 200 మంది సర్పంచ్ అభ్యర్థులు, వార్డులకు 613 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు.

కొండమల్లేపల్లి: మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకర్ ప్రక్రియ ప్రారంభమైంది. కొండమల్లేపల్లి మండలంలో 27 గ్రామపంచాయతీలను 9 క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. మొదటి రోజు 27 గ్రామ సర్పంచ్ స్థానాలకు 37 నామినేషన్లు, 216 వార్డు స్థానాలకు 51 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

గుర్రంపోడు: గుర్రంపోడు మండలంలో 38 గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు 29 మంది నామినేషన్లు, 318మంది వార్డు సభ్యులకు 40మంది వార్డు సభ్యులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో మహేష్ తెలిపారు.

దేవరకొండ డివిజన్‌లో...

దేవరకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో బుధవారం సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైంది. డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో 196 మంది సర్పంచ్ అభ్యర్థులు, 220 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు.

మండలం	సర్పంచులు	వార్డు సభ్యులు
దేవరకొండ	32	19
డిండి	8	13
చందంపేట	19	34
పీఏపల్లి	20	11
గుడిపల్లి	21	36
గుర్రంపోడు	29	40
చింతపల్లి	13	12
కొండమల్లేపల్లి	37	51
నేరేడుగొమ్ము	17	4
మొత్తం	**196**	**220**



వింజమూర్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ రాంమూర్తి

నిబంధనలు పాటించాలి

చింతపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ రాంమూర్తి అన్నారు. చింతపల్లి మండలంలోని వింజమూరు, కుర్మేడ్, తదితర గ్రామాల్లో బుధవారం ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్రమంగా డబ్బులతో పాటు మద్యం తాగి వాహనాలను నడపడం చట్ట విరుద్ధమన్నారు. సోషల్‌మీడియాలో వాట్సాప్ గ్రూప్‌లో రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు పోస్ట్ చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా నిలిచిన ధాన్యం లారీ

● రాకపోకలకు ఇబ్బంది



రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయిన లారీ

వేములపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులోగల రైస్ మిల్లుల వద్ద నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. మిల్లుల వద్ద 43 టన్నుల లారీ వేబ్రిడ్జిపై తూకం వేసుకొని యూటర్న్ తీసుకుంటుండగా కమాన్ పట్టాలు, బెడ్ బోల్టులు, జాయింట్ ఎక్సెల్‌లు విరిగాయి. దీంతో రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయింది. దీంతో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై వందలాది వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తన సిబ్బందితో పాటు హైవే సిబ్బంది కలిసి లారీలోని ధాన్యాన్ని వేరొక లారీలోకి తరలించేలా చర్యలు చేపట్టి లారీని క్రేన్ సహాయంతో రోడ్డు పక్కకు తొలగించారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

రిజర్వేషన్లలో కోత విధించడం సరికాదు

మిర్యాలగూడటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లలో కోత విధించడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు న్యాయబద్ధమైన రిజర్వేషన్లు కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ హైకోర్టును ఆశ్రయించడం సమర్థనీయమన్నారు. 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని నమ్మబలికి, అమలవుతున్న రిజర్వేషన్లలో కోత విధించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం ఎంతవరకు సబబన్నారు. బీసీ నాయకులు రాజకీయ నాయకులను, రిజర్వేషన్లు వ్యతిరేకిస్తున్న పార్టీలతో అంటకాగడం సిగ్గుచేటన్నారు. పాతపద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కర్నాటి శివరామకృష్ణ, సన్నీ, వెంకన్న, సంతోష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జెన్‌కో నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

నాగార్జునసాగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జెన్‌కో ఉద్యోగుల నూతన రీజనల్ కమిటీ కార్యవర్గాన్ని బుధవారం సాగర్‌లో ఎన్నుకున్నారు. రీజనల్ ప్రెసిడెంట్‌గా తంగెళ్ల శ్రీనివాస్‌రావు, రీజనల్ సెక్రటరీగా యోగానంద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ అస్రఫ్‌అహ్మద్, ట్రెజరర్‌గా ఎస్‌కే. గౌస్‌పాషా, గౌరవ అధ్యక్షుడిగా నర్సింహరాజును ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీధర్, పిన్నింటి మాధవరావు అధ్యక్షతన కమిటీ ఎన్నిక జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో కార్యవర్గ సభ్యులు సాయిబాబు, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణారావు, రమేష్, రెహ్మాన్, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో నామినేషన్

మిర్యాలగూడ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడెం గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు తప్పుడు కుల ధ్రువీకరణపత్రంతో నామినేషన్ వేసిందని గ్రామానికి చెందిన మేక ఆనంద్ ఆరోపించారు. బుధవారం ఆయన ఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. 1వ వార్డు సభ్యురాలిగా సోంగా లక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరానికి చెందిన ఆమె స్థానికంగా ఉంటూ తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించినట్లు ఆరోపించారు. నామినేషన్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఎన్నికల నియమావళి ఆధారంగా సంబంధిత అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మిర్యాలగూడ డివిజన్‌లో 2,116 నామినేషన్లు

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో 282 గ్రామపంచాయతీలకు ఈ నెల 14న రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 2వ తేదీతో నామినేషన్ల ఘట్టం పూర్తికాగా, బుధవారం నామినేషన్ల పరిశీలన ముగిసింది. ఆయా గ్రామపంచాయతీల్లో 2,116మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు సంపూర్తిగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. అత్యధికంగా మిర్యాలగూడ మండలంలో 46 గ్రామపంచాయతీలుండగా 360మంది తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఒక్కో సర్పంచ్ స్థానానికి సగటున 8 నుంచి 9 మంది పోటీపడుతున్నారు. మిగతా మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అదేవిధంగా 2,418 వార్డులకు గాను 6,120 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డుసభ్యుడి పదవి కోసం పోటీపడుతున్న వారిలో ప్రజాదరణ కలిగిన వ్యక్తిని బరిలో నిలిపి సర్పంచ్ అభ్యర్థులకు గంపగుత్తాగా ఓట్లు రాబట్టేలా రాజకీయ పక్షాలు వడపోత మొదలుపెట్టాయి.

శ్రీకాంతాచారి ఆశయ సాధనకు కృషి చేయాలి



దేవరకొండలో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి ఆశయ సాధనకు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేవరకొండలో బీసీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాంతాచారి తెలంగాణ ఉద్యమంలో పోరాడి అమరుడయ్యాడని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కోటేశ్వర్‌రావు, వెంకటచారి, నగేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన కాసోజు శ్రీకాంతాచారి ఆశయ సాధనకు యువత కృషి చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్ అన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంజియాదవ్, దొండ సురేష్, సాయికుమార్‌రెడ్డి, పవన్, హరీష్, కృష్ణ, వెంకటసాయి, భరత్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

● అమరవీరుల పార్కులో బీసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సభ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేగొండి మురళీయాదవ్, జ్వాలా వెంకటేశ్వర్లు, దాసరాజు జయరాజు, శ్యాంసుందర్, గోపయ్య, శివయ్య, కిరణ్, సుధాకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ: చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

దివ్యాంగులను గౌరవంగా చూడాలి



దామరచర్ల: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో బాలాజీనాయక్

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను గౌరవంగా చూసుకోవడం మనందరి బాధ్యత అని ఎంఈవో వెంకటయ్య అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ దివ్యాంగులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారిపై సానుకూల దృక్పథం కలిగి ఉండాలని అన్నారు. దివ్యాంగుల్లో మనోధైర్యం ఎక్కువగా ఉంటుందని, అదే వారిని అనుకున్న లక్ష్యం చేరుకునేలా చేస్తుందన్నారు. విద్య ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. ప్రభుత్వపరంగా లభించే అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు ఎల్. పద్మ, సీహెచ్ మాదవి, ఎమ్మార్సీ సిబ్బంది ఎమ్.ప్రేమ్‌సాగర్, జహంగీర్‌పాష, వెంకటేశ్వర్లు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మనో ధైర్యాన్ని కల్పించాలి

దామరచర్ల: తమ పిల్లలు అంగవైకల్యాన్ని జయించే విధంగా తల్లిదండ్రులు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఎంఈవో బాలాజీనాయక్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. మండల పరిధిలో 18 సంవత్సరాలలోపు 79 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారని, 15 మంది మానసిక, శారీరక దివ్యాంగులు భవిత కేంద్రంలో సమ్మిళిత విద్యను పొందుతున్నారని అన్నారు. మిగిలిన వారు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. దివ్యాంగుల వైకల్యాలను బట్టి సమగ్ర శిక్ష ద్వారా సహాయ ఉపకరణాలు అందిస్తున్నామని, గ్రహణ మొర్రి వారికి ఉచితంగా సర్జరీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగంపల్లి రవి, నంద్యాల లక్ష్మమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.



పెద్దవూర: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో రాములు

పెద్దవూర: మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో తరి రాములు పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దివ్యాంగులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ శ్రీనివాస్, మహేష్, రేణుకలను, ఐఈఆర్‌పీ రమేష్‌ను, ఉపాధ్యాయులు రాములును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్స్, ఎస్జీటీలు మహేష్, రేణుక, సీఆర్‌పీ వెంకటయ్య, ఉపాధ్యాయులు చంద్రమౌళి, నరేందర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ విజయ్, విజయ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి: వీహెచ్‌పీ



మామిడి సత్యనారాయణ

మిర్యాలగూడటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు భంగపరిచేలా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి, వాస్తు సిద్ధాంతి మామిడి సత్యనారాయణ డిమాండ్ చేశారు. హిందూ దేవుళ్లని కించపరుస్తూ మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. హిందువుల ఓట్లతో గెలిచి, వారినే చులకనగా చూడటం, మరో వర్గాన్ని పొగడటం సరికాదన్నారు. రాష్ట్ర అత్యున్నత పదవిలో ఉండి సమాజానికి రేవంత్ ఇచ్చే సందేశమిదేనా అని ప్రశ్నించారు. రాజకీయ పబ్బం గడుపుకునేందుకు మత విద్వేషాలు రెచ్చగొట్టడం తగదన్నారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

విద్యార్థులు చరిత్ర గురించి తెలుసుకోవాలి



స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల చిత్రపటాలతో విద్యార్థులు

మిర్యాలగూడటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చరిత్ర గురించి ఖచ్చితంగా తెలుసుకోవాలని సాంఘికశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్షుడు నల్లమేకల వెంకయ్య అన్నారు. వంద మంది స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల చిత్రపటాలను పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు దేశ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహానాయుల గురించి అవగాహన పెంచేందుకు ఆయా నాయకుల పేర్లతో కూడిన నూరు ఫొటోలను అందజేసినట్లు తెలిపారు. వందమందిలో ఒక్కో ఫొటోలోని ఒక్కొక్కరికి ప్రత్యేక చరిత్ర అన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు సాంఘిక శాస్త్రంపై అవగాహన పెంచుకుంటే పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందన్నారు. బకాల్‌వాడీ పాఠశాల కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యాసేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అల్లుబెల్లి కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రహీం, సైదానాయక్, పద్మావతి, సునీత, పంగ సైదులు, శ్రీనివాస్, చిన్నయ్య, వెంకటేశ్వర్లు, మక్ల తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడతలో హోరాహోరీ

(5వ పేజీ తరువాయి)

నెలకొంది. బీఆర్ఎస్ అన్ని పంచాయతీల్లోనూ అభ్యర్థులను రంగంలోకి దించడంతో పోటీ తప్పలేదు. నియోజకవర్గంలో సర్పంచ్ పదవులన్నింటికీ కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు ప్రయత్నిస్తుంటే, ప్రతిచోటా బలమైన పోటీ ఇవ్వడంతో పాటు, వీలైనన్ని పంచాయతీల్లో పాగావేయాలనే సంకల్పంతో బీఆర్ఎస్ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి.

రెండో విడత భారీగా నామినేషన్లు

జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరిగే మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్‌లోని 280 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 2,057 నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక్కో పంచాయతీకి సగటున ఏడుగురికిపైగా అభ్యర్థులు పోటీపడుతున్నారు. మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలతో పాటుగా అతిస్వల్పంగా నల్లగొండ నియోజకవర్గంలోని గ్రామాలు ఈ డివిజన్‌లో ఉన్నాయి. ఇక్కడ అన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ నుంచి నలుగురు, ఐదుగురు వరకు అభ్యర్థులు సర్పంచ్ పదవిని ఆశిస్తూ నామినేషన్లు దాఖలు చేయగా, బీఆర్ఎస్ అన్ని పంచాయతీల్లో అభ్యర్థులను నిలబెట్టింది. సీపీఎం సైతం అభ్యర్థులు పోటీచేసే చోట మద్దతుగా నిలిచి అవసరమైతే కాంగ్రెస్, లేకపోతే బీఆర్ఎస్ స్థానిక నేతలతో అవగాహన కుదిర్చేందుకు సన్నాహాలు చేస్తోంది. నాగార్జునసాగర్ నియోజకవర్గం అనుముల మండలంలోని పేరూరు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్టీకి కేటాయించగా, ఈ గ్రామంలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేకపోవడంతో సర్పంచ్ పదవికి ఒక్క నామినేషన్ కూడా దాఖలవలేదు. అయితే ఎస్టీ జనాభా లేనిచోట ఎస్టీకి ఎలా రిజర్వ్ చేస్తారనే ఆగ్రహంతో గ్రామస్థులు వార్డు సభ్యుల పదవులకు సైతం నామినేషన్లు వేయకుండా ఎన్నికలను బహిష్కరించారు. మిగిలినచోట్ల అధికార పార్టీలో సర్పంచ్ పదవులను ఆశిస్తూ నలుగురైదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో బలమైన అభ్యర్థులను బరిలో ఉంచి, మిగిలినవారిని తప్పించేందుకు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు బుజ్జగింపుల పర్వం ప్రారంభించారు. సర్పంచ్ పదవికి పోటీ నుంచి తప్పుకుంటే భవిష్యత్‌లో సమానస్థాయిలో ఎంపీటీసీ, సింగిల్‌విండో చైర్మన్, మార్కెట్ డైరెక్టర్లు, దేవాలయ కమిటీల పదవులు ఇప్పిస్తామని, అదేవిధంగా ఆర్థికంగా ఉపయుక్తమయ్యేలా కాంట్రాక్టులు, ఇతరపనులు ఇప్పిస్తామని, పార్టీ పదవుల్లో బాధ్యతలిచ్చి గౌరవిస్తామనే హామీలతో చర్చలు ప్రారంభించారు. డివిజన్‌లో ఎన్నికలు జరిగే పంచాయతీల్లో కొన్నిచోట్ల ఏకగ్రీవాలకు సైతం అంతర్గతంగా చర్చలు మొదలయ్యాయి. పోటీచేసి పరస్పరం విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టడం కంటే గ్రామాభివృద్ధికి ఆ నిధులు కేటాయించి ఏకగ్రీవం చేసుకుందామనే ప్రతిపాదనలు చేస్తున్న గ్రామపెద్దలు అభ్యర్థులతో చర్చిస్తున్నారు.

మూడో విడతకు మొదలైన నామినేషన్లు

జిల్లాలో మూడో విడత ఎన్నికలు జరిగే తొమ్మిది మండలాల్లోని 269 గ్రామపంచాయతీలు, 2,206 వార్డు స్థానాలకు బుధవారంనుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. చింతపల్లి మండలంలోని తక్కెళ్లపల్లి పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్‌కు కేటాయించగా, ఆ కేటగిరికి చెందిన ఓటర్లు లేకపోవడంతో అక్కడ వార్డు సభ్యులకు మాత్రమే ఎన్నిక జరగనుంది. అదే విధంగా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీని ఏకగ్రీవం చేసినందుకు సర్పంచ్ అభ్యర్థి పి.వెంకటయ్య రూ.51.30లక్షలతో గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, శివాలయ నిర్మాణం చేస్తానని అంగీకరించారు. ఈ గ్రామం సైతం చిన్నపంచాయతీనే అయినా, సర్పంచ్‌గా ఏకగ్రీవంగా అంగీకరించిన వెంకటయ్య రాజకీయాల్లో ఉన్న వ్యక్తి కావడంతో పాటు, రియల్‌ఎస్టేట్ వ్యాపారి కావడంతో ఈ వ్యయానికి అంగీకరించారు. గుర్రంపోడు మండలం ములకలపల్లిలోనూ రామాలయం నిర్మించేందుకు ముందుకువచ్చిన బొడ్డులింగస్వామిని సర్పంచ్‌గా ఏకగ్రీవం చేయాలని నిర్ణయించారు. అందుకోసం ఎంత ఖర్చయినా ఆయనే వెచ్చించాలని నిర్ణయించారు. తాజాగా, బుధవారం నేరేడుగొమ్ము మండలం పేర్వాల గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్ నాయకుడు వీరమల్ల రామకృష్ణను ఏకగ్రీవం చేయాలని, అందుకోసం గ్రామంలో గుడి నిర్మాణం, బొడ్రాయి ప్రతిష్ఠకు రూ.36లక్షల వరకు వెచ్చించాలనిగ్రామస్థులు తీర్మానించారు. మిగిలిన 263 పంచాయతీలకు నామినేషన్లు మొదలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ నాటికి పెద్దసంఖ్యలో ఏకగ్రీవాలయ్యే అవకాశం ఉందని అంచనావేస్తున్నారు.